లోక్‌సభపై పార్టీల ఫోకస్

- షెడ్యూల్ వెలువడుతుందన్న ప్రచారంతో అప్రమత్తం
- క్షేత్రస్థాయిలో కేడర్‌కు దిశానిర్దేశం చేస్తూ సమావేశాలు
- ఖమ్మం కాంగ్రెస్ టికెట్‌కు భారీ డిమాండ్



ఖమ్మం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ త్వరలో రాబోతుందన్న ప్రచారంతో జిల్లాలో రాజకీయపక్షాలు లోక్‌సభ ఎన్నికల రణరంగానికి సిద్ధమవుతున్నాయి క్షేత్రస్థాయిలో నాయకులు కార్యకర్తలు, బూత్‌స్థాయి నాయకులను అప్రమత్తం చేస్తున్నారు. కేంద్ర బడ్జెట్ సమావేశాల అనంతరం షెడ్యూల్ వస్తుందన్న ప్రచారంతో ఎన్నికల్లో విజయంకోసం ప్రధానపార్టీలు కార్యచరణకు దిగుతున్నాయి. అభ్యర్థుల సంగతి ఎలా ఉన్నా పార్టీ గెలుపే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో పది నియోజకవర్గాల్లో 9చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు భారీ మెజారిటీలతో విజయం సాధించారు. భద్రాచలంలోనే స్వల్ప ఆధిక్యతతో బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపొందారు. అసెంబ్లీ నియోజకవర్గాల మెజారిటీల ప్రకారం ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు భారీ ఆధిక్యత కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల హడావుడి మొదలు కావడంతో బూత్‌స్థాయి కమిటీలకు మళ్లీ డిమాండ్ ఏర్పడింది. హైదరాబాదులో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గే ఆధ్వర్యంలో కాంగ్రెస్ బూత్‌స్థాయి కన్వీనర్లకు సభ నిర్వహిస్తుండడంతో జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ బూత్‌స్థాయి కన్వీనర్లు హైదరాబాదుకు పయనమవుతున్నారు. జిల్లాలోనూ నియోజకవర్గస్థాయి బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఖమ్మం నియోజకవర్గస్థాయి బూత్ ఏజెంట్లతో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ రాబోయే ఎన్నికలకు రెడీగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. అయితే జిల్లాలో కాంగ్రెస లోక్‌సభ అభ్యర్థి ఎవరన్న విషయం ఇంకా తేలలేదు. ఏఐసీసీ అధినేత సోనియగాంధీని ఖమ్మం ఎంపీగా పోటీచేయాలని జిల్లా మంత్రుల తోపాటు సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తదితరులు ఆహ్వానించారు. ఒక వేళ సోనియాగాంధీ ఇక్కడినుంచి పోటీ చేయకపోతే కాంగ్రెస్ టికెట్ తనకే దక్కుతుందన్న ధీమాతో కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి ఉన్నారు. మరోవైపు మంత్రుల వారసులు కూడా టికెట్ రేసులో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, మంత్రి తుమ్మల తనయుడు తుమ్మల యుగంధర్, మంత్రి పొంగులేటి సోదరుడు పొంగులేటి ప్రసాదరెడ్డి పేర్లు ప్రచారంలో ఉన్నాయి. వీరితోపాటు మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నేత రాయల నాగేశ్వరరావు, వీవీసీ అధినేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు టికెట్లు ఆశిస్తున్నారు. మరోవైపు బీఆర్‌ఎస్ కూడా జిల్లాలో లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతోంది. ఆ పార్టీ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి పేరు అధికారికంగా ప్రకటించకపోయినా బీఆర్‌ఎస్ లోక్‌సభపక్ష నేతగా నామ నాగేశ్వరావు ఉండడంతో ఆయన పేరును పార్టీ అధినేత కేసీఆర్ సత్తుపల్లి ఎన్నికల ప్రచార సభలో ప్రకటించారు. ఇటీవల ఖమ్మం లోక్‌సభ బీఆర్‌ఎస్ సమీక్షా సమావేశంలోనూ ఏకగ్రీవంగా నామ పేరును సూచించారు. నామా నాగేశ్వరరావు కూడా బుధవారం తన నివాసంలో ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశమై లోక్‌సభ ఎన్నికలపై చర్చించారు. మరోవైపు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కూడా తన జన్మదిన వేడుకల పేరుతో రాజకీయ హంగామా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం నుంచి కేడర్‌ను లోక్‌సభ ఎన్నికలవైపు మళ్లించేందుకు బీఆర్‌ఎస్ ప్రయత్నాలు ప్రారంభించింది. ఇక బీజేపీ కూడా లోక్‌సభ ఎన్నికలపై దృష్టిలో పెట్టింది. జిల్లాలో కేంద్రమంత్రులను ప్రచారంలోకి దింపింది. అయోధ్య రామాలయ అంశాన్ని ఎన్నికల అస్త్రంగా చేసుకుని ప్రజల్లోకి వెళుతోంది. ఖమ్మంలోక్‌సభ స్థానాన్ని మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, గత ఎన్నికల్లో పోటీచేసిన దేవకి వాసుదేవరావు టికెట్ ఆశిస్తున్నారు. మరికొందరు కూడా ఖమ్మం బీజేపీ టికెట్‌పై ఆసక్తి చూపుతున్నారు. ఇక వామపక్షాల విషయానికి వస్తే జిల్లాలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఇప్పటికీ ఆ పార్టీలు ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ, కాంగ్రెస కలిసి పనిచేసినందున ఈ ఎన్నికల్లోనూ ఆ రెండు పార్టీలు కలిసి పని చేసే అవకాశం ఉంది. సీపీఎం ఇంకా తటస్తంగానే ఉంది. టీడీపీ అసెంబ్లీ ఎన్నికల్లో అనధికారికంగా కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడంతోపాటు బీఆర్‌ఎస్ ఓటమే ధ్యేయంగా ఆ పార్టీ నాయకులు పనిచేశారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కే మద్దతు ఇచ్చేందుకు టీడీపీ అనధికారికంగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇటీవల ఎన్టీఆర్ జన్మదిన వేడుకలకు కేంద్రమాజీమంత్రి రేణుకాచౌదరిని ఆహ్వానించి ఆమె చేతులమీదుగా ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ ఓటమే లక్ష్యంగా పనిచేస్తామని కొందరు టీడీపీ నాయకులు బహిరంగంగానే ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో

'వేటు' మొదలైంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- ఖమ్మం కార్పొరేషన్‌లో పలువురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు
- ఇద్దరు ఉద్యోగుల సెక్షన్ మార్పు
- అయినా వారు పాత సెక్షన్‌లోనే కొనసాగిస్తున్న విధులు ?
- రెవెన్యూ విభాగంలో పనిచేసిన వారిపైనా చర్యలకు అవకాశం



ఖమ్మం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రక్షాళన ప్రారంభమైంది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల సమీక్ష అనంతరం నుంచి కార్పొరేషన్ కారాలయంలో జరిగిన అవకవతకలపై వివరాలను సేకరిస్తోన్న కమిషనర్ ఆదర్శ్ సురభి విభాగాల వారీగా పలువురు ఉద్యోగులపై చర్యలకు పూనుకున్నట్టు తెలుస్తోంది. దానికి సంబంధించి ఇప్పటికే రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ సెక్షన్లతోపాటు, కొందరు అధికారుల దగ్గర కం ప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తున్న ఐదుగురిని తొలగించినట్టు సమాచారం. కాగా అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో తీసుకున్న ఉద్యోగుల్లో చాలామంది అసలు ఉద్యోగం చేయకుండానే జీతాలు డ్రా చేస్తున్నారన్న ఆరోపణలు, పలు అక్రమాల్లో వారిపాత్ర కీలకంగా ఉన్నవారిపై 'వేటు' వేసినట్టు తెలుస్తోంది. వారితో పాటుగా రెవెన్యూ సెక్షన్‌లో ఉన్న ఇద్దరు ఉద్యోగులను నీటి సరఫరా సెక్షన్‌కు బదిలీ చేసినట్టు తెలిసింది. అయితే వారు మాత్రం సదరు సెక్షన్‌కు వెళ్లకుండా పాత సెక్షన్‌లోనే విధులు నిర్వర్తించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమాలకు పాల్పడుతు న్న, విధులకు హాజరుకానీవారు, అక్రమ పద్ధతిలో ఉద్యోగంలో చేరిన వారు వంటి వారి వివరాలను సేకరించి దానిపై విచారణ జరుపుతున్నట్టు వినికిడి. దొంగ అసెస్‌మెంట్ల వ్యవహారానికి సంబంధించి రెవెన్యూ సెక్షన్‌లో గతంలో పనిచేసిన మరో ఇద్దరు అధికారులపైన వేటు పడే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. ఆయా విభాగాలపై ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి ప్రక్షాళన చేయాలని ప్రజలు కోరుతున్నారు. కాగా కార్పొరేషన్‌లో అవినీతి అక్రమాలపై మంగళవారం మంత్రి సమీక్ష సందర్భంగా 'అవినీతి అడ్డా' శీర్షికతో కథనం ప్రచురించిన విషయం విదితమే.

పోటెత్తిన ఎర్రబంగారం



ఖమ్మం మార్కెట్, జనవరి 24:ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్ ఎర్రబంగారం (మిర్చి) ఎరుపెక్కింది. బుధవారం సుమారు 40వేల మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. కొత్త మిర్చి ప్రారంభమైన తరువాత ఈ సీజన్‌లో తొలిసారిగా పంట ఇంత భారీగా రావడం ఇదే ప్రథమం. కాగా మార్కెట్‌లో తేజా రకం డీలక్స్ ఎండు మిరపను క్వింటాలు రూ.21,000 జెండాపాట ధర నిర్ణయించగా వ్యాపారులు నాణ్యతను బట్టి క్వింటాలు కనిష్టంగా రూ.14,000లకు, నమూనా రకాలను క్వింటాలు రూ.18,500 లకు కొనుగోలు చేశారు.

ఇది ఎన్నికల ఏడాది..

అప్రమత్తంగా ఉండాలి

- లోక్‌సభనుంచి స్థానిక సంస్థలవరకు కాంగ్రెస్ జెండా ఎగరాలి
- కార్యకర్తల కష్టంతోనే రాష్ట్రంలో అధికారం
- స్థానిక క్యాడర్ అనుమతి ఉంటేనే పార్టీలోకి కొత్తవారు
- ఖమ్మం కార్యకర్తల సమావేశంలో మంత్రి తుమ్మల



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, జనవరి 24(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇకపై వచ్చేదంతా ఎన్నికల కాలమని, ఈ సంవత్సరంలో జరిగే లోక్‌సభ, పంచాయతీ, సహకార, మండల, జిల్లాపరిషత్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు సిద్ధంగా ఉండాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గ్రామస్థాయినుంచి డివిజన్‌స్థాయి వరకు కార్యకర్తలు, నాయకుల అనుమతితోనే చేరికలు ఉంటాయన్నారు. కాంగ్రెస్ పార్టీ గేట్లు తీస్తే పార్టీలోకి దూకేందుకు చాలామంది సిద్ధంగా ఉన్నారు. వారు వస్తే మీరు కూర్చోవడానికి కూడా కుర్చీలుఉండవు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో ఖమ్మం నియోజకవర్గ పోలింగ్‌బూత్‌స్థాయి ఏజెంట్లు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ కొందరు ప్రతిపక్ష నాయకులు కాంగ్రెస్ పార్టీకి ఏదోలా బొక్కపెట్టాలని చూస్తున్నారని కానీ అవతలిపార్టీనే సున్నా అయ్యేలా కనిపిస్తోందన్నారు. కాంగ్రెస్‌నుంచి వెళ్లేవారు ఎవ్వరూ లేరన్నారు. కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేందుకే చాలామంది సిద్ధంగా ఉన్నారన్నారు. తాము గేట్లు తీస్తే ఎంతోమంది దూకడానికి సిద్ధంగా ఉన్నారన్నాని, కూర్చునేందుకు కుర్చీలు కూడా ఖాళీగా ఉండవన్నారు. పార్టీ విజయం కోసం కష్టపడ్డ కార్యకర్తలు, నాయకుల కుర్చీలను కొత్తగా వచ్చేవారికి ఇచ్చేందుకు సిద్ధంగా లేమని స్పష్టం చేశారు. ఈ సంవత్సరం లోక్‌సభ ఎన్నికల తర్వాత, సహకార, పంచాయతీ, మండల, జిల్లాపరిషత్ ఎన్నికలు వరుసగా రాబోతున్నాయన్నారు. కొత్తగా ఎవరినైనా పార్టీలోకి చేర్చుకోవాలంటే గ్రామ, డివిజన్ స్థాయిలో కార్యకర్తలు, నాయకుల అనుమతితోనే చేర్చుకుంటామే తప్ప ఎవరినీ నేరుగా చేర్చుకునే పరిస్థితి ఉండబోదన్నారు. పదేళ్లుగా అధికారం లేకపోయినా గత ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పోలింగ్‌బూత్‌ల్లో డబ్బులకు లొంగకుండా, బెదిరింపులకు, దౌర్జన్యాలకు భయపడకుండా కర్రపట్టుకుని పోలింగ్‌బూత్ వద్ద కాంగ్రెస్ విజయం కోసం పని చేశారని, అధికార పార్టీకే చుక్కలు చూపించిన ఘనత కార్యకర్తలదన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలకు గౌరవం కల్పించడమే తన లక్ష్యమన్నారు. కార్యకర్తల కష్టంతో వచ్చిన ఈ ప్రభుత్వం కార్యకర్తలు తల ఎత్తుకుని తిరిగేలా పనిచేస్తుందని హామీ ఇచ్చారు. పేదవర్గాలకు ఆరు గ్యారంటీపథకాలు అమలయ్యేలా చూస్తామన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం రూ.7లక్షలకోట్లు అప్పులుచేసిందని, అయినా ఇచ్చిన హామీలన్నీ అమలుచేసి తీరుతామన్నారు. దేశానికి రాహుల్‌గాంధీ నాయకత్వం అందించేందుకు ప్రతి ఒక్కరు పట్టుదలతో పనిచేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తల నిర్ణయం మేరకే అభ్యర్థుల ఎంపిక ఉంటుదని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసిన స్ఫూర్తితోనే లోక్‌సభ ఎన్నికల్లో కూడా ప్రతి ఒక్కరు పనిచేయాలన్నారు. తన క్యాంపు కార్యాలయంలో దరఖాస్తులు తీసుకుని క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులను కూడా ఆరా తీసిన తర్వాతనే మంజూరులుంటాయని స్పష్టం చేశారు. కార్యకర్తలు, నాయకులుపై పోలీసులు పెట్టిన కేసులును ఎత్తేస్తామన్నారు. దీనిపై ఇప్పటికే సమీక్ష చేయాలని పోలీసు అధికారులను ఆదేశించానని, ప్రభుత్వం కూడా దీనిపై నిర్ణయం తీసుకుంటుందన్నారు సమావేశంలో మాజీ ఎమ్మెల్సీబాలసాని లక్ష్మీనారాయణ, నగర అధ్యక్షుడు జావీద్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ దీపక్‌చౌదరి, ఏఎంసీ మాజీఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



తుమ్మలకు వినతిపత్రం అందజేస్తున్న ఆంధ్రా రైతులు



పామాయిల్ రైతుల సమస్యలు వివరిస్తున్న దృశ్యం

పామాయిల్‌కు గిట్టుబాటు ధర కోసం

కేంద్రంపై ఒత్తిడి తేవాలి

మంత్రి తుమ్మలను కలిసిన ఏపీ రైతులు

దమ్మపేట, జనవరి 24: గిట్టుబాటు ధరలేక పామాయిల్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఏపీకి చెందిన పామాయిల్ రైతులు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకొచ్చారు. ఏపీ పామాయిల్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పా రాఘవరావు, జాతీయ పామాయిల్‌సంఘం కార్యదర్శి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో కృష్ణా, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన సుమారు 50మంది రైతులు బుధవారం భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం అల్లిపల్లి గ్రామంలో తుమ్మలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది వరకు టన్ను పామాయిల్ గెలల ధర రూ.24వేలు ఉండగా కేంద్రప్రభుత్వ చర్యలవల్ల ప్రస్తుతం ఆ ధర రూ.12వేలకు పడిపోయిందన్నారు. దీంతో పాయిల్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. దీనికి తోడు కేంద్రప్రభుత్వం ప్రైవేటు ఫ్యాక్టరీల యాజమాన్యాలతో కుమ్మక్కై ఏకపక్షంగా జీవోలు తెచ్చి రైతులపై బలవంతంగా రుద్ధాలని చూస్తోందని, వాటిని ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు తిరస్కరించాయని తుమ్మల దృష్టికి తెచ్చారు. పామాయిల్ మద్దతు ధరకోసం కేంద్రప్రభుత్వంపై పోరాటం చేస్తున్నామని, తమకు సహకరించాలని తుమ్మలకు విజ్ఞప్తి చేశారు. అశ్వారావుపేట పామాయిల్ కర్మాగారం ఏర్పాటుకు తుమ్మల చేసిన కృషి వల్ల తమకు మేలు జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ అనుచిత వైఖరి వల్ల దిగుమతి సుంకం తగ్గించటంతో పామాయిల్ ధర తగ్గిపోయిందన్నారు. పామాయిల్ సాగు చేస్తున్న ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పామాయిల్ రైతులకు మేలు చేసేలా కృషి చేస్తానని తుమ్మల హామీ ఇచ్చారు. అనంతరం ఆంధ్రా రైతులు తుమ్మలను సత్కరించారు. తుమ్మలతో పాటు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, తెలంగాణా పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాద్, బండి భాస్కర్, దొడ్డా ప్రసాద్, గుత్తా రాజా, అడపా రాంబాబు, ఎల్లిన మురళి, ఆంధ్రా రైతులు ఆలపాటి రాంబాబు, ముళ్లపూడి మరళి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా


బీఆర్క్ పరీక్ష



విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపిస్తున్న దృశ్యం

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 24: దేశవ్యాప్తంగా ఎన్‌టీఏ వారు నిర్వహించే జేఈఈ మెయిన్స్, బీఆర్క్ మొదటి విడత 2024 పరీక్షల్లో బుధవారం బీఆర్క్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా కో-ఆర్డినేటర్ ఆర్. పార్వతిరెడ్డి తెలిపారు. మెత్తం 1,071 విద్యార్థులకు గాను 1,041 మంది విద్యార్థులు హజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీలు చేసిన అనంతరమే పరీక్షా కేంద్రాలలోకి అనుమతించారు. మెత్తం ఆరు పరీక్షా కేంద్రాలలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ పరీక్ష నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద పూర్తిస్థాయి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. 27 నుంచి మెయిన్స్ మొదటి విడత పరీక్షకు ప్రారంభం కానున్నాయి.

ఉపకార వెతలు



- పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల విడుదలలో తీవ్ర జాప్యం
- విద్యా సంవత్సరం ముగిసినా ఖాతాల్లో జమకాని నగదు
- సరిఫికెట్ల కోసం ఇబ్బందులెదుర్కొంటున్న విద్యార్థులు

ఖమ్మం ఖానాపురం హవేలీ, జనవరి 24: పోస్టుమెట్రిక్ విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపకార వేతన పథకం నిర్లక్ష్యానికి గురవుతోంది. ఈ పథకం కింద ఇవ్వాల్సిన నిధులను విడుదల చేయడంలో సర్కా రు తాత్సారం చేస్తోంది. విద్యా సంవత్సరం ముగిసినా పంపిణీ ప్రక్రియ ఎక్కడికక్కడే పెండింగ్‌లో ఉండిపోతోంది. దీంతో ప్రభుత్వమిచ్చే ఉపకార వేతనాలతో పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌కు వినియోగించుకోవచ్చని భావించిన విద్యార్థులకు ఈ జాప్యం సంకటంగా మారుతోంది. బోధన ఫీజులు, ఉపకారవేతనాల కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. రెండేళ్లుగా సంక్షేమ విద్యార్థులకు ఫీజులు విడుదల చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. బోధన రుసుములు, ఉపకార వేతనాల కోసం ఉమ్మడి జిల్లాలో ఏటా సుమారు 40వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఆ మరుసటి ఏడాదే ప్రభుత్వం బోధన ఫీజులు, ఉపకారవేతనాలు చెల్లిస్తూ వస్తోంది. కరోనా అనంతరం చెల్లింపులు ఆలస్యం కావడంతో బకాయిలు భారీగా పెరుగుతున్నాయి. ఇప్పటికే కోర్సులు పూర్తిచేసిన, చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులకు ఉపకారవేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఫీజుల విడుదలలో ఆలస్యం, సంక్షేమ శాఖలు విడుదల చేసిన బిల్లులు ట్రెజరీల్లో పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థులు ఉన్నతవిద్య, ఉద్యోగ అవకాశాల కోసం అప్పులు చేసి కళాశాలల్లో ఫీజులు చెల్లించి ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటున్నారు. బిల్లులను సంక్షేమ శాఖలు ట్రెజరీలకు పంపిస్తున్నా ఒక్క రూపాయి కూడా విడుదల కావడం లేదు. బీసీ, ఈబీసీ, మైనార్టీ సంక్షేమశాఖల్లో నిధుల కొరత నెలకొంది.

దరఖాస్తు గడువు పొడిగింపు

2023-24విద్యాసంవత్సరానికి ఉపకారవేతనాలు, బోధన ఫీజుల కోసం సంక్షేమశాఖలు దరఖాస్తులు స్వీకరిస్తున్నాయి. దరఖాస్తు గడువు డిసెంబరు 31తో ముగిసింది. అయితే ప్రొఫెషనల్ కోర్సుల ప్రవేశాల ప్రక్రియ ఆలస్యం కావడంతో దరఖాస్తు గడువు మరో మూడు నెలలు పొడిగించారు.

కోర్సు ముగిసినా పెండింగ్‌లోనే..

ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన ఇంటర్మీడియెట్ నుంచి డిగ్రీ, పీజీ, వృత్తి విద్యా కోర్సులు చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉపకార వేతనాలు ఇస్తోంది. కోర్సు మధ్యలో ఈ నిధులను విడుదల చేస్తే ఆయా విద్యార్థులకు ఉపయోగపడతాయి. కానీ గత కొన్నేళ్లుగా నిధుల విడుదల గాడితప్పుతోంది. కోర్సు ముగిసినా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థుల ప్రణాళిక గాడి తప్పుతోంది. 2021-22, 2022-23 సంవత్సరాలకు సంబంధించి బీసీ పోస్టు మెట్రిక్ ఉపకారవేతనాలు(ఎంటీఎఫ్) పెండింగ్‌లో ఉన్నాయి. బీసీ ఫీ రీయింబర్స్‌మెంట్ (ఆర్‌టీఎఫ్) 20021-22కు సంబంధించి రూ.1.30కోట్లు, 2022-23కు సంబంధించి రూ.22.79కోట్లు మొత్తం రూ.24.09కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈబీసీ ఫీ రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి 2021-22సంవత్సరానికి రూ.20లక్షలు, 2022-23సంవత్సరానికి సంబంధిచి రూ.4.8కోట్లు మొత్తం రూ.5కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. బీసీ ఉపకారవేలునాలు 2021-22కు సంబంధింది మొత్తం రూ.1.50కోట్లు, 2022-23కు సంబంధించి రూ.27.59కోట్లు మొత్తం రూ.29.09కోట్లు పెండింగులో ఉన్నాయి. మైనారిటీ విద్యార్థులకు 2022-23 విద్యాసంవత్సరానికి గాను రూ.62కోట్ల, 5లక్షల, 54వేలు బకాయిలు ఉన్నాయి. 2021-22 విద్యా సంవత్సరానికి సంబందించి 80 శాతం వరకే నిధులు విడుదల చేశారు. మిగిలిన నిధులు నేటికి విడుదల చేయకపోవటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మొత్తం చెల్లిస్తేనే సర్టిఫికెట్లు..

ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద వచ్చే మొత్తంతో పాటు ఉపకార వేతనాన్ని సైతం ట్యూషన్ ఫీజు కింద ఇవ్వాలని గ్రామీణ ప్రాంతాల్లోని ఇంటర్, డిగ్రీ కాలేజీలు అడ్మిషన్ సమయంలోనే ఒప్పందం కుదుర్చుకుంటున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఇంటర్ స్థాయిలో ఒక్కో విద్యార్థికి రూ.5వేల ఉపకార వేతనం, రూ.1,900 ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద మొత్తం రూ.6,900 వస్తోంది. అలాగే డిగ్రీ విద్యార్థులకు రూ.5వేల ఉపకార వేతనం, రూ.10వేల వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తోంది. ఈ రెండింటినీ కలిపి ట్యూషన్ ఫీజు కింద కాలేజీ యాజ మాన్యాలకు చెల్లిస్తున్నారు. కాగా ఉపకారవేతనాలు రాకపోవడంతో ఉపకార వేతనం కింద వచ్చే మొత్తాన్ని చెల్లించాలని, లేకుంటే ఏటీఎం కార్డులను ఇవ్వాలని కాలేజీలు డిమాండ్ చేస్తున్నాయి.

వైరాలో యాసంగి వరిసాగు




దమ్ము చేస్తున్న ట్రాక్టర్, నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

వైరా, జనవరి 24: వైరా మండలంలోని పలు గ్రామాల్లో ముమ్మరంగా యాసంగి వరిసాగు చేస్తున్నారు. యాసంగిలో వరిసాగు చేయవద్దని వ్యవసాయ, నీటిపారుదలశాఖ అధికారులు ప్రకటించినప్పటికీ పలు గ్రామాల్లోని రైతులు మాత్రం యాసంగి సేద్యం చేస్తున్నారు. వైరా రిజర్వాయర్‌లో నీటి లభ్యత లేనందున కుడి, ఎడమకాల్వల కింద ఎట్టిపరిస్థితుల్లోనూ వరి ఇతర పంటలు సాగుచేయవద్దని నీటిపారుదల శాఖ అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే వైరానదిలో నీటి లభ్యత ఆధారంగా జాలిముడి బ్యాక్ వాటర్ కింద బోర్లు, బావుల కింద గరికపాడు, దాచాపురం, గన్నవరం, నారపనేనిపల్లి, ముసలిమడుగు, కొండకొడిమ, తదితర గ్రామాల్లోని రైతులు వరిసాగుచేస్తున్నారు. పొగమంచు వలన వరినార్లు చల్లినా ఏపుగా ఎదగవనే కారణంతో చాలా మంది రైతులు నేరుగా దమ్ము చేసి వరి విత్తనాలు వెదజల్లుతున్నారు. మరికొంతమంది రైతులు ఇప్పటికే వరినారుమళ్లు పోసి పెంచారు. ఆ నార్లతో బెంగాలీ కూలీలు నాట్లు వేస్తున్నారు. ప్రస్తుతం పొలాల్లో దమ్ములు చేస్తూ వరిసాగులో పలువురు రైతులు బిజీబిజీగా ఉన్నారు.

ఆయిల్‌ఫెడ్ అక్రమాలపై విచారణ కోరుతూ హైకోర్టులో పిల్

సత్తుపల్లి, జనవరి 24: ఆయిల్‌ఫెడ్‌లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని కోరుతూ తెలంగాణ ఆయిల్ ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్ పామ్ గ్రోవెర్స్ సొసైటీ హైకోర్టులో కేసు దాఖలు చేసింది. దీనికి సంబంధించి సొసైటీ అధ్యక్షుడు తుంబూరు ఉమామహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రుపాలెం కేంద్రంగా ఆ ప్రాంతంలో పండిన పామాయిల్ గెలలను అశ్వారావుపేట, అప్పారావుపేటలలోని ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలకు రవాణా చేసేందుకుగానూ ఒక కలెక్షన్ ఏజంట్‌ను నియమించారు. వాస్తవంగా అధికారులను నియమించిన ఏజంట్ నందిగామ రజిత ఏలూరుకు చెందిన మహిళ. ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఆమెను ఎర్రుపాలెం ప్రాంతంలో అప్పట్లో కేవలం 40ఎకరాలలోపు మాత్రమే ఆయిల్‌పామ్ సాగులో ఉంది. కానీ ఆ ఏడాది 30వేలకు పైగా పామాయిల్ గెలలను ఫ్యాక్టరీలకు రవాణా చేసినట్లు చూపారు. దీనికి సంబంధించి రూ.2.5కోట్లు పేమెంట్ కూడా తీసుకున్నారని, మొత్తం లావాదేవీలు ఏలూరులోని ఒక ప్రవేటు బ్యాంకులో జరిగినట్లు ఆయిల్‌పామ్ గ్రోయర్స్ సొసైటీ దృష్టికి వచ్చింది. పరిమిత స్థాయిలో పామాయిల్ విస్తీర్ణం కలిగిన ఎర్రుపాలెం మండలంలో వేలాది టన్నులు ఫ్రూట్ ఎలా అందుబాటులోకి వచ్చిందని సొసైటీ బాధ్యులు అనుమానించారు. దీనిపై ఆరా తీయగా ఆంధ్రాలో వివిధ ప్రాంతాలలో సాగుచేసిన పామాయిల్ దిగుబడులను అశ్వారావుపేట, అప్పారావుపేట ఫ్యాక్టరీలకు తరలించినట్లు ఆధారాలతో సహా సొసైటీ సేకరించింది. ఆయిల్ పామ్ చట్టం ప్రకారం వేరే రాష్ట్రానికి చెందిన ఉత్పత్తిని తెలంగాణాలో విక్రయించడానికి వీలులేదు. అయినా సదరు మహిళను పామాయిల్ రైతుగానూ, ట్రాన్స్‌ఫోర్టర్‌గానూ, వాటాదారుగా చూపించి రూ.రెండున్నర కోట్లు చెల్లించారని సొసైటీ గుర్తించింది.

పట్టించుకోని అధికారులు

జరిగిన అక్రమాలపై రెండేళ్లుగా అధికారులకు ఫిర్యాదు చేసినా దీనిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించాలని కోరుతూ ఆయిల్ గ్రోయర్స్ సొసైటీ హైకోర్టును ఆశ్రయించగా విచారణకు స్వీకరించినట్లు ఉమామహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు?

- గ్రీన్‌బెల్టు కింద పనికిరాని ముక్కలు
- 15శాతం మార్టిగేజ్ చేయలేదు
- అబద్ధాల బ్రోచర్లతో ప్రచారం

నేలకొండపల్లి, జనవరి 24: నేలకొండపల్లిలో నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు వేస్తూ, అబద్దాలతో, అర చేతిలో స్వర్గం చూపుతూ బ్రోచర్లు విడుదల చేసి కొనుగోలుదారులను మభ్య పెడుతున్నప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదు. డీటీసీపీ అప్రూవల్ వచ్చిందని చెపుతూ సంబంధిత గ్రామ పంచాయతీకి నిబంధనల ప్రకారం 15 శాతం భూమిని మార్టిగేజ్ చేయకుండా, పనికి రాని ప్లాట్లను గ్రీన్‌బెల్టు కింద చూపుతూ బ్రోచర్లు విడుదల చేసి అమాయకులను మోసం చేస్తున్నారు. అంతే గాకుండా ప్రపోజ్డ్ మున్సిపాలిటీ, సైట్‌కు అతి దగ్గరలో నూతన బస్టాండ్, ప్రకృతి ఆశ్రమం, బౌద్ధస్థూపం అంటూ ప్రచారం చేస్తున్నారు.

వివరాల్లోకి వెళితే నేలకొండపల్లికి చెందిన 8మంది రైతుల వద్ద సర్వే నెంబర్లు 70/పి, 71/పి, 72/;పి, 73/పిలలో 10.268 సెంట్లు కొనుగోలు చేసి పిట్టల నాగమణి పేరు మీద గ్రామ పంచాయతీకి లేఅవుట్ అనుమతి కోసం దరఖాస్తు చేశారు. గ్రామ పంచాయతీకి నిబంధనల ప్రకారం మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయటానికి 15 శాతం భూమిని తనఖా పెట్టాల్సి ఉండగా అటువంటిదేమీ చేయలేదు. డీటీసీపీ ఇచ్చిన టెక్నికల్ లేఅవుట్‌లో ఉన్న నిబంధనలను ఏఒక్కటీ పాటించలేదు. కానీ అబద్దాలతో ఒక బ్రోచర్‌ను తీసి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి వెంచర్లో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. మధ్యలో ఒక బోరు వేసి మూత వేయకుండా ఉంది. రోడ్లు వేయలేదు, విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. డ్రైనేజీలు కట్టలేదు... కానీ ప్లాట్లు మాత్రం అమ్మకానికి పెట్టారు...అమ్ముతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు చూస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలకు ఉపక్రమించటం లేదు. గ్రామ పంచాయతీ మాత్రం వెంచర్లో పాతిన రాళ్లను పీకించింది.



నేలకొండపల్లి బైపాస్ పక్కన ఏర్పాటు చేసిన వెంచర్

రియల్టర్లకు అలవాటుగా మారింది....

నిబంధనలను అతిక్రమించటం, గ్రీన్‌బెల్టు ఇవ్వకుండా, మార్టిగేజ్ చేయకుండా ప్లాట్లను అమ్మకాలకు పెట్టటం రియల్టర్లకు పరిపాటిగా మారింది. ఇప్పుడు కొత్తగా వేసిన వెంచర్లలో సైతం నిబంధనల ప్రకారం ఏ రియల్టర్ కూడా గ్రీన్‌బెల్టు స్థలాలివ్వటం లేదు. ఇచ్చినట్లుగా కాగితాలపై ఉంటున్నదే తప్ప, వేసిన వెంచర్‌కు సరిపడా నిబంధనల ప్రకారం ఇచ్చిందీ లేనిదీ తెలియటం లేదు. ఒక వేళ కొద్దీ, గొప్పా ఇచ్చిన అది దేనికీ పనికిరానిదై ఉంటున్నప్పటికీ అధికారులు కిమ్మనటం లేదు. అభివృద్ధి చేయకుండానే కొనుగోలుదారులను మోసం చేస్తున్నారు. రియల్టర్లు గ్రీన్‌బెల్టుగా చూపించిన ప్లాట్లను సైతం అమ్ముకున్న సంఘటనలు ఎన్నో. గతంలో 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించగా, కలెక్టర్ ఆదేశాలతో అధికారులు కొంత మేర గ్రీన్‌బెల్టు స్థలాలను తీసుకున్నారు. కానీ కొంతమంది తమకున్న రాజకీయ పలుకుబడితో గ్రీన్‌బెల్టు ఇవ్వకుండానే తప్పించుకున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి,రియల్టర్ల అబద్ధపు ప్రచారాన్ని నిలువరించాలని, నిబంధనల ప్రకారం గ్రీన్‌బెల్టు స్థలాలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీలో డ్రైవర్ పాత్ర ముఖ్యమైంది: ఆర్ఎంవో

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 24: ఆర్టీసీలో డ్రైవర్ పాత్ర చాలా ముఖ్యమైందని రీజనల్ మేనేజర్ వెంకన్న అన్నారు. బుధవారం డ్రైవర్స్ డే సందర్భంగా ఖమ్మం సిటీ, నూతన బస్టాండ్‌తోపాటు డిపోలో డ్రైవర్స్ డే కార్యక్రమాలు నిర్వహించారు. డ్రైవర్స్ ఉద్యోగులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంవీఐ వరప్రసాద్ ఉత్తమ ఉద్యోగులను సన్మానించారు. రీజనల్ మేనేజర్ వెంకన్న మాట్లాడుతూ అందరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, ప్రమాద రహితంగా వాహనాను నడపాలని సూచించారు. ఆర్టీసీలో డ్రైవర్ పాత్రను కొనియాడారు ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ బి శ్రీనివాస్‌రావు డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.



ఆర్టీసీ డ్రైవర్లతో ఆర్ఎం వెంకన్న

నేటినుంచి రాజీవ్ ట్రోఫీ క్రికెట్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 24: ఖమ్మం క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈనెల 31 వరకు నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో రాజీవ్‌గాంధీ మెమోరియల్ ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు స్టేడియంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. నగరంలో 9 సంవత్సరాల విరామం తరువాత నిర్వహించబోయే ఈ టోర్నీలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి దాదాపు అన్ని మండలాల టీములు పాల్గొననున్నాయని ఎస్పీ స్టేడియం క్రికెట్ నెట్స్ ఇన్‌చార్జ్ మతిన్ తెలిపారు. టోర్నీని నగర క్రీడాభిమానులు ఆస్వాదించాలని ఆయన కోరారు.

కొబ్బరి వృక్ష మిత్రలకు శిక్షణ

అశ్వారావుపేట, జనవరి 24: అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో ఆరురోజుల పాటు కొబ్బరి వృక్ష మిత్రలకు జరిగే శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. విజయవాడ కొబ్బరి అభివృద్ధి బోర్డు సహకారంలో వ్యవసాయ కళాశాల అశ్వారావుపేటలో ప్రారంభమైన ఈ శిక్షణ తరగతులకు బోర్డు డిప్యూటీ డైరక్టర్ కుమార్ వేల్ ముఖ్య అతిథిగ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కొబ్బరి బోర్డు స్కీము గురించి వివరించారు. ట్రైనీలు రైతులకు, కొబ్బరి చెట్టు ఎక్కేవారికి కొబ్బరి చెట్టు ఎక్కడం, ఇతర శాస్త్రీయ అంశాలు తెలుసుకొని ఉపయోగించుకోవాలని సూచించారు. 20 మంది నిరుద్యోగ యువతీ యువకులకు కొబ్బరి దింపుపైన, కొబ్బరి కాయలు కోయడంపైన, కొబ్బరిపై చీడ, పీడ వాటి నివారణ గురించి వివరించారు. కొబ్బరి వృక్షాలు ఎక్కే యంత్రాలతో ఏ విధంగా ఎక్కాలో శిక్షణ నిచ్చారు. ప్రతి రోజు ఉదయం 6గం.ల నుంచి సాయంత్రం వరకు జాగింగ్, యోగ, శాస్త్రీయ జ్ఞానాన్ని, స్కిట్, డ్రామా, క్షే త్ర దర్శన వంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డా. జే హేమంత్ కుమార్ మాట్లాడుతూ కొబ్బరి మిత్రలు శిక్షణలో ట్రైనీలు ఇచ్చిన అంశాలపై అవగాహన పెంపొందించుకొని ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమాన్ని డా. కే శిరీష, డా. పీ నీలిమ సమన్వయ పరిచారు. శిక్షణలో నారంవారిగూడెం, పేరాయిగూడెం, అశ్వారావుపేటకు చెందిన 20 మంది ట్రైనీస్ పాల్గొన్నారు. కార్యక్రమంలో డా. ఐవీ శ్రీనివాసరెడ్డి, డా. గోపాలకృష్ణ, డా.శ్రావణ్, రమేష్, కోటేశ్వర్, ఝాన్సీ, రాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ హేమంత్‌కుమార్

ఈ ఏడాది 253మందిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు

- మొదటిసారి పట్టుపడితే కౌన్సిలింగ్
- ట్రాఫిక్ ఏసీపీ సారంగపాణి

ఖమ్మంక్రైం, జనవరి 24: మద్యంతాగి వాహనాలు నడుపుతున్నవారిపై కసులు నమోదు చేయడంతోపాటు న్యాయస్థానంలో జరిమాన,శిక్షలు పడేలా ట్రా ఫిక్ పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారని ట్రాఫిక్ ఏసీపీ సారంగపాణి తెలిపారు. ఖమ్మం నగరంలో ప్రతిరోజు స్పెషల్ డ్రైవ్ ద్వారా సైలెన్సర్లు మార్చి న్యూసెన్సు క్రియేట్‌చేసేవారితో పాటు నెంబరుప్లేటు లేకుండా తిరగేవాహనాలపై కేసులు నమోదుచేస్తూ బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈఏడాది జనవరిలో ఇప్పటి వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం 253మంది పట్టుబడ్డారని, వారికి కౌన్సెలింగ్ నిర్వహించి కోర్టు ద్వారా జరిమానాలు విధించినట్టు తెలిపారు. మొదటిసారి డ్రంక్అండ్‌డ్రైవ్‌లో పట్టుబడితే కుటుం బసభ్యుల మధ్య కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, ఆతర్వాత కోర్టులో హాజరుపరిచి డ్రైవిగ్ లైసెన్సు రద్దుచేసేలా ఆర్టీఏ అధికారులకు లెటర్‌పెడతామని తెలిపారు. గతేడాది కమిషన రేట్ పరిధిలో నిర్వహించిన డ్రంక్అండ్‌డ్రైవ్ తనిఖీల్లో 6309మంది వాహనదారులు పై కేసులు నమోదుచేశామని, వీరిపై చార్జిషీటు దాఖలుచేసి వాహనదారుల కు రూ.33,51,890లు జరిమానా విధించినట్టు ఆయన తెలిపారు. డ్రంక్అండ్‌డ్రైవ్ కేసుల్లో పట్టుబడి శిక్షఖరారైన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు, వీసాలు, పాస్‌పోర్టు అంశాలలో ఇబ్బందులు కూడా తలెత్తుతాయని, మద్యం సేవించి వాహనం డ్రైవ్ చేయవద్దన్నారు. అదేవిధంగా గతేడాదిలో 10నుంచి15మంది మాత్రమే రెండోసారి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారనిఈ పర్సంటేజిని కూడా తగ్గించేందుక ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు. ఈతనిఖీలలో సీఐ అశోక్‌రెడ్డి, ఎస్ఐ రవి, సిబ్బంది పాల్గొన్నారు.



బ్రీత్ఎన్‌లైజర్‌తో పరీక్షిస్తున్న దృశ్యం

సింగరేణి ఉత్తమ ఉద్యోగులు వీరే..

రుద్రంపూర్, జనవరి 24: 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా సింగరేణిలోని 11 ఏరియాల నుంచి 13 మంది ఉత్తమ అధికారులుగా, ఉత్తమ సింగరేణియన్లుగా ఎంపిక చేసినట్టు జీఎం (పర్సనల్) వెల్ఫేర్ బసవయ్య బుధవారం తెలిపారు. క్రమం తప్పకుండా విధులకు హాజరౌతూ రక్షణ చర్యలు పాటిస్తూ అత్యధిక ఉత్పత్తిని సాధించినందుకు 13 మందిని ఎంపిక చేశామన్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌కు చెందిన ఎం.సురేష్, కార్పొరేట్ కట్ట బసవయ్య జీఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్‌ఆర్‌సీ కొత్తగూడేనికి చెందిన సీహెచ్.శ్రీనివాస్, డీవైఎస్ఈ(ఈఅండ్ఎమ్) ఇల్లెందు బోడా నాగేశ్వరరావు, ఈఈ (ఈఅండ్ఎమ్) మణుగూరు సీహెచ్.శ్రీనివాసరెడ్డి, ఎస్ఈ (ఎస్ఎంఎంసి), ఆర్‌జీ-1 అనిల్, గబాలే, కాలరీ మేనేజర్ ఆర్‌జీ-2 ఆర్.రమేష్ (అడిషనల్‌మేనేజర్) ఆర్‌జీ-3 ఎం.కాసివిశ్వేశ్వరరావు, కె.జనార్ధన్(ఎస్ఓఎం), మరో 12 మందిని ఉత్తమ సింగరేణియన్లుగా ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

ఏటిలో పడి వ్యక్తి మృతి

మధిరటౌన్, జనవరి 24: మధిర లోని శివాలయం వద్ద వైరా ఏటిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధిర మండలం తొర్లపాడు కు చెందిన ఇస్మాయిల్(54) మధిర లోని అజాద్ రోడ్డు చివరిలో నివసిస్తూ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు, ఇతడు ఏటి ఒడ్డున ఉన్న కట్టెలు కొట్టటానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు అని బావిస్తున్నారు. మధిర టౌన్ ఎస్ఐ రాజేష్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని శవపరీక్ష కోసం మధిర ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సులో బంగారు ఆభరణాలు చోరీ..

సత్తుపల్లిరూరల్, జనవరి 24: ఆర్టీసీ ప్రయాణిస్తున్న ఓ మహిళకు చెందిన బ్యాగులోని సుమారు రూ.17.95లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురవ్వగా సత్తుపల్లి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. బాధితురాలు ఆంధ్రాలోని జంగారెడ్డిగూడేనికి చెందిన ఆంగోతు లలిత ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 22న సత్తుపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన ఏపీ 29జడ్1664 నెంబర్ గల బస్సును అశ్వారావుపేట వెళ్లేందుకు బస్టాండ్‌లో ఎక్కాను. తన బ్యాగ్‌లో దుస్తులతో పాటు బంగారు ఆభరణలతో ప్రయాణించి గమ్యస్థానం అశ్వారావుపేట బస్టాండ్‌లో దిగాను. అయితే తన పక్కనే ఉన్న బ్యాగ్‌ను కట్‌చేసి అందులోని బంగారు, వెండి ఆభరణాలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు ఫిర్యాదులో బాధితురాలు లలిత పేర్కొన్నారు. వాటి విలువ సుమారు రూ.17,95,500 ఉంటుందని, తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. ఫిర్యాదు స్వీకరించిన పట్టణ సీఐ జే.మోహనబాబు కేసు నమోదుచేసి ధర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మధిర రూరల్, జనవరి 24: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం మధిర మండలం దెందుకూరు-తొండలగోపవరం గ్రామాల మధ్య జరిగింది. దెందుకూరు-తొండలగోపవరం గ్రామాల మధ్య ఆటో, ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎన్టీఆర్ జిల్లా జయంతి గ్రామానికి చెందిన గూడూరు శ్రీనివాసరెడ్డి(43) కుడి చేయి తెగిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. వీరిని 108వాహనంలో మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శ్రీనివాసరెడ్డి మృతిచెందారు. రూరల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గూడ్స్‌రైలు నుంచి విడిపోయిన బోగీలు

చింతకాని జనవరి 24: మండల పరిధిలోని నాగులవంచ రైల్వే స్టేషన్ సమీపంలో ఓ గూడ్స్ రైలు నుంచి బోగీలు విడిపోయాయి. విజయవాడ నుంచి వరంగల్ వైపు గూడ్స్‌రైలు బుధవారం రాత్రి 7 గంటల సమయంలో పాతర్లపాడు 113 రైల్వే గేటు వద్దకు చేరుకోగానే బోగీల మధ్య ఉన్న లింకులు హఠాత్తుగా తెగిపోయి రైలు నుంచి రెండు బోగీలు విడిపోయాయి. నాగులవంచ స్టేషన్ వద్ద రైలు వేగం నెమ్మదించిన సమయంలో బోగీలు విడిపోవడంతో గేటు వద్ద ఉన్న ఉద్యోగి లోకోపైలట్‌ను అప్రమత్తం చేశాడు. వెంటనే లోకో పైలట్ రైలును నిలిపివేశాడు. స్థానిక రైల్వే అధికారులు ఘటనపై ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో విజయవాడ నుంచి వరంగల్ వెళ్లే పలు రైళ్లను సమీప రైల్వే స్టేషన్‌లలో నిలుపుదల చేశారు. సమాచారం తెలుసుకున్న రైల్వే సాంకేతిక సిబ్బంది ఘటన ప్రాంతానికి చేరుకొని రైలు బోగీలకు మరమ్మత్తులు నిర్వహించి విడిపోయిన బోగీలను రైలుకు జతచేయడంతో లోకో పైలట్ గూడ్స్ రైలును గమ్యం వైపు కదలించాడు. బోగీలు రైల్వే గేటు సమీపంలో విడిపోవడంతో స్థానిక గేటు సిబ్బంది మూసిన గేటును తీయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు గంట సమయం వరకు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

అవినీతి ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి

- విజయ డెయిరీ ఎదుట పాడిరైతుల ధర్నా

ఖమ్మంకార్పొరేషన్, జనవరి 24: విజయ డెయిరీలో అవినీతి ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని, పాలలో వెన్నను తగ్గించి పాడిరైతులను మోసం చేస్తున్న ఘటనపై విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ పాడిరైతులు బుధవారం విజయ డెయిరీ ఎదుట ధర్నా నిర్వహించారు. డెయిరీ డీడీ సెలవులో ఉండటంతో అక్కడి వచ్చిన మేనేజర్‌తో పాడి రైతులు వాగ్వాదానికి దిగారు. తమను మేనేజర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని పాడిరైతులు ఆరోపించారు. పాడిరైతులు మాట్లాడుతూ విజయ డెయిరీలో సొసైటీ అధ్యక్షులు వెన్నశాతం పరిశీలిస్తే గర్బర్ పరీక్షలో లీటర్‌పాలలో వెన్నశాతం 6.8శాతం వచ్చిందని, లైజర్ మిషన్‌లో పరీక్ష చేస్తే 6.3శాతం వచ్చిందన్నారు. ఇలా ప్రతి పాడిరైతు లీటర్‌కు 0.5శాతం వెన్న నష్టపోతున్నారన్నారు. వెన్నవాతం తగ్గించి 9నెలలుగా కోటి రూపాయలకు పైగా సొమ్ములు స్వాహా చేశారని పాడిరైతులు ఆరోపించారు. స్వాహా చేసిన సొమ్ములను రికవరీ చేసి, తిరిగి పాడిరైతుల ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. దీనికి పూర్తిబాధ్యత మేనేజర్ వహించాలన్నారు. విజయ డెయిరీలో జరుగుతన్న అక్రమాలను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు పాడిరైతులు ధర్నా సందర్భంగదా పేర్కొన్నారు.



ఆందోళన చేస్తున్న పాడి రైతులు

వేడెక్కిన మున్సిపల్ 'అవిశ్వాసం'

- బీఆర్ఎస్ కౌన్సిలర్లకు విప్ జారీ

ఇల్లెందుటౌన్, జనవరి 24: ఇల్లెందు మున్సిపల్ అవిశ్వాస తీర్మాణం ఒక్కసారిగా వేడెక్కింది. ఛైర్మన్ దమ్మాలపాటి వెంటకటేశ్వరావుపై బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాసం తీర్మాణంపై వచ్చె నెల 5న ఓటింగ్ జరుగనుంది. ఇప్పటికే బీఆర్ఎస్ కౌన్సిలర్లుతోపాటు, ఇరువురు కౌన్సిలర్లు క్యాంపునకు తరలిపోయారు. బీఆర్ఎస్‌కు చెందిన 19 మంది కౌన్సిలర్లుకు బీఆర్ఎస్ విప్‌జారీ చేసింది. ఈ మేరకు బుధవారం ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరిప్రియ 19 మంది కౌన్సిలర్లుకు విప్‌జారీ చేశారు. వచ్చె నెల 5న జరిగే అవిశ్వాస తీర్మాణ సమావేశంలో పాల్గొన్నాలని విప్‌కు అనుకూలంగా ఉండాలని, మున్సిపల్ ఛైర్మన్‌పై ఇచ్చిన అవిశ్వాసాన్ని బలపరచాలని, విప్‌లో పేర్కొన్నా రు. విప్‌ను దిక్కరిస్తే శిక్షఅర్హులు అవుతారని చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బీఆర్ఎస్‌లో కౌన్సిలర్‌గా గెలుపొంది ఛైర్మన్ అయిన వెంకటేశ్వరావు ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అయనతోపాటు కొందరు కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ పెట్టిన అవిశ్వాసానికి సీపీఐ 23వ వార్డు కౌన్సిలర్ కుమ్మరి రవిందర్, ఎన్డీ చంద్రన్న వర్గం కౌన్సిలర్ నాగలక్ష్మీ తదితరులు అవిశ్వాస తీర్మాణంపై మద్దతు తెలిపారు. అవిశ్వాసాన్ని ఎలాగైన గట్టెంకించాలని ప్రయత్నిస్తుండగా, అవిశ్వాసం నుంచి ఏ విధింగానైనా దిగిపోయేటట్లు కాంగ్రెస్ విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. కాగా మున్సిపల్‌ఛైర్మన్‌పై అవిశ్వాసం పెట్టిన ఛైర్మన్‌పై కూడా విప్ చేయడం గమనార్హం

మద్యం మత్తులో యువకుల వీరంగం

ఆళ్లపల్లి, జనవరి 24: మద్యం మత్తులో ముగ్గురు యువకులు ఆళ్లపల్లి మండలంలోని, మర్కోడులో బుధవారం రోడ్డుపై వీరంగం సృష్టించారు. తమ పేర్లు మైక్‌లో ఎందుకు చదవడం లేదని కో ఆపరేటివ్ బ్యాంక్ ఉద్యోగులపై దాడీ చేశారు. కోఆపరేటీవ్ అసిస్టెంట్ మేనేజర్ సుమన్, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉమ్మడి గుండాల మండల కో-ఆపరేటీవ్‌బ్యాంక్‌లో అప్పుఉన్న వారి పేర్లు తమ జీప్, మైక్‌లో వివరిస్తు బుధవారం ఆళ్లపల్లి మండలంలోని బోడాయికుంట నుంచి మర్కోడు వస్తున్నారు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న యువకులు జీప్‌ను ఆపి మా పేర్లు ఎందుకు చదవడం లేదని ప్రశ్నించగా, సిబ్బంది ఇందులో అప్పు ఉన్నవారిపేర్లు మాత్రమే చదువుతామని చెప్పి ముందుకు వెళ్లగా, మార్గమద్యలో పెద్దురు దగ్గర సిబ్బంది వాహనానికి బైక్ అడ్డుగా పెట్టి సిబ్బంది పై దాడిచేశారు. యువకులు డ్రైవర్‌ను బెదిరించి జీప్‌లో ఉన్న యాంపిల్‌బాక్స్ ధ్వంసం చేసి, బ్యాంక్‌కు సంబందించి పత్రాలు బయటపడేశారు. అప్పటితో ఆగకపోగా మద్యం మత్తులో ఉన్న ఆ యువకులు మర్కోడులో ఓ షాప్‌లో పనిచేస్తున్న గడ్డం నాని అనే యువకుడు అడ్డురావడంతో అతనిపై దాడీచేశారు.దాంతో ఆగకపోగా కరకగూడెం వేళ్లేదారిసెంటర్లో కత్తులతో హల్‌చల్‌చేశారు. విషయం తెలుసుకున్న ఆళ్లపల్లి పోలీసులు వచ్చి ఆ యువకులను అదుపులోకి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కోఆపరేటివ్ ఉద్యోగులు, మరో వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యప్తు చేస్తున్నామని ఆళ్లపల్లి ఎస్ఐ రతీష్ తెలిపారు.

హైలెవల్ వంతెనపై ట్యాంకర్ బ్రేక్‌డౌన్

- రహదారిపై భారీగా స్తంభించిన ట్రాఫిక్

వైరా, జనవరి 24: వైరా నది హైలెవల్ వంతెనపై ఓ ఆయిల్ ట్యాంకర్ బ్రేక్‌డౌన్ అయింది. దాంతో హైలెవల్ వంతెనకు రెండువైపులా జాతీయ ప్రధాన రహదారిలో కిలో మీటర్ల కొద్దీ వాహనాల రాకపోకలు నిల్చిపోయాయి. వేలాది మంది ప్రయాణీకులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తల్లాడ నుంచి వైరా వైపు వస్తున్న ఆయిల్ ట్యాంకర్ హైలెవల్ వంతెనపై బ్రేక్‌డౌన్ అయి నిల్చిపోయింది. దీంతో వంతెనపైన ఒకవైపునే రాకపోకలు ఇబ్బందికరంగా మారాయి. ఆసమయంలో వాహనాలు ఎదురెదురుగా రావడంతో పరిస్థితి అదుపుతప్పింది. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకొని పరిస్థితిని చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టారు. సాయంత్రం వేళ కావడంతో విద్యాలయాల బస్సులు, వివిధ కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, అనేక వర్గాల వారు ఈ వంతెనకు రెండువైపులా ఇరుక్కుపోయి తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వంతెనకు రెండువైపులా దాదాపు ఐదుకిలోమీటర్లకుపైగా వాహనాలు బారులుతీరి నిల్చిపోయాయి. వైరా ఏఎస్ఐ వెంకటనారాయణ, కానిస్టేబుల్ బాల్యా ఇతర సిబ్బంది వెంటనే బ్రేక్‌డౌన్ అయిన ట్యాంకర్‌ను పక్కకు తప్పించారు. దాదాపు గంటన్నర తర్వాత రాకపోకలు యధావిధిగా కొనసాగాయి.



ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న పోలీసులు

పార్లమెంట్ ఎన్నికలకు సంసిద్ధం కావాలి: నామా

ఖమ్మంకార్పొరేషన్, జనవరి 24: పార్లమెంట్ ఎన్నికలకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలని, ప్రతి కార్యకర్త ప్రజాక్షేత్రంలో నిలవాలని బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు కోరారు. బుధవారం నామా క్యాంప్ కార్యాలయంలో పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలు నామాను కలిశారు. కొంతమంది తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను నామాకు వివరించారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని నామా వారికి హామీ ఇచ్చారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపీ నామా మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. త్వరలోనే పార్లమెంట్ నియోజకవర్గం వ్యాప్తంగా పర్యటిస్తానని నామా పేర్కొన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు చెప్పిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళతానన్నారు..గురువారం కొత్తగూడెంలో జరిగే దిశ కమిటీ సమావేశంలో సమస్యలను అధికారులతో చర్చిస్తామన్నారు. అలాగే రానున్న పార్లమెంటరీ సమావేశాల్లో రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ నిదులు, పెండింగ్ ప్రాజెక్టులు ఇతర సమస్యలపై కేంద్రప్రభుత్వాన్ని నిలదీస్తామని నామా పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైరా మాజీఎమ్మెల్యే రాములునాయక్, పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, మధరి, వైరా, కొత్తగూడెం నియోజకవర్గాల నుండి ఎంపీపీలతో సహా పలువురు ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడుతున్న ఎంపీ నామా

గంజాయి వ్యవహారంతో పోలీసుశాఖలో కలకలం

- స్టేషన్ల వారీగా వివరాలు సేకరిస్తున్న జిల్లా అధికారులు
- భూపాలపల్లి జిల్లాలో భద్రాద్రి కానిస్టేబుల్ అరెస్టు

భద్రాచలం, జనవరి 24: గంజాయి పట్టుబడిన వ్యవహారంలో భద్రాచలానికి చెందిన కానిస్టేబుల్ రమేష్ పట్టుబడటం, బూర్గంపాడు పోలీసు స్టేషన్‌లో పట్టుబడిన గంజాయి మాయం కావడం వ్యవహారాలతో జిల్లా పోలీసు శాఖలో కలకలం రేకెత్తింతించింది. గంజాయి అక్రమ రవాణాదారులను పట్టుకునేందుకు పోలీసు బృందాలు సైతం గాలింపు చర్యలు చేపడుతున్నాయి. కాగా గంజాయి అక్రమ తరలింపులో ముగ్గురు వ్యక్తులు భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం తిరుమలగిరి క్రాస్ వద్ద పట్టుబడ్డట్లు సీసీఎస్ సీఐ పులి వెంకట్, రేగొండ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి మూడు కేజీల పొడి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వారు వెల్లడించారు. దీంతో ముగ్గురు నిందితులను ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చే సి రిమాండ్‌కు తరలించినట్లు వారు వెల్లడించారు. వీరిలో జిల్లాలోని భద్రాచలం పోలీసు స్టేషన్‌కు చెందిన పొడియం రమేష్‌రావుతో పాటు భద్రాచలంలోని జంగాల కాలనీకి చెందిన ఉప్పు సాయి, ఏఎస్ఆర్ కాలనీకి చెందిన కణితి రమణలు ఉన్నట్లు వారు పేర్కొన్నారు. ఊహించని రీతిలో గంజాయి అక్రమ రవాణా కేసులో భద్రాచలం పోలీసు స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ అరెస్టు కావడం ఆ శాఖ సిబ్బందిని సైతం నివ్వెరపరుస్తోంది. అదేవిధంగా బూర్గంపాడు పోలీసుస్టేషన్ నుంచి గతంలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన గంజాయిలో కొంత భాగం మాయం కావడం, రెండు ద్విచక్ర వాహనాలు సైతం కనిపించకపోవడం పోలీసు శాఖ అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా నిలుస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ రెండు ఘటనలు ఒకే రోజు చోటు చేసుకోవడంతో పోలీసు శాఖలో సైతం ఇది కలకలం సృష్టిస్తోంది.

స్టేషన్ల వారీగా వివరాలు సేకరిస్తున్న ఎస్పీ?

రెండు పోలీసు స్టేషన్‌లలో భిన్న రీతుల్లో గంజాయి మాయం కావడంతో ఈ విషయంపై ఎస్పీ రోహిత్‌రాజ్ సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోది. ఈ నేపథ్యంలో ఇందుకు బాధ్యులైన వారిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చే సినట్లు ప్రచారం సాగుతోంది. అలాగే ఇప్పటి వరకు జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌ల పరిధిలో గంజాయి కేసుల వివరాలతో సీజ్ చేసిన గంజాయి నిల్వల వివరాలను స్టేషన్ల వారీగా అందించాలని సంబంధిత ఎస్‌హెచ్‌వోలను ఆదేశించినట్లు సమాచారం. దీంతో అధికారులు ఇందుకు సంబంధించిన పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. గంజాయి అక్రమ రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని భావిస్తున్న తరుణంలో తమ శాఖ తీరుతోనే తలనొప్పులు వస్తున్నాయని పోలీసు వర్గాల నుంచి వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ రెండు ఘటనల తరువాత సంఘటనలు పునరావృతం కాకుండా ఇకపై చర్యలు చేపట్టే దిశగా పోలీసులు కసరత్తు చేపడుతున్నారు.

గంజాయి స్మగ్లర్ల అరెస్టు

రేగొండ, జనవరి 24: గంజాయి సరఫరా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారని సీసీఎస్ సీఐ పులి వెంకట్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలానికి చెందిన పోడియం రమేష్, ఉప్పు సాయి, కణతి రమణ రేగొండ మండల కేంద్రం శివారు తిరుమలగిరి ఆర్చ్ వద్ద పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించారని తెలిపారు. వారిని విచారించగా మూడు కిలోల ఎండు గంజాయి లభించిందని తెలిపారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. ఈ వ్యవహారంలో సూత్రధారి రమేష్ అని, అతడు కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడని తెలిపారు. మరో ఇద్దరు డ్రైవర్లుగా పని చేస్తున్నారని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

బూర్గంపాడు, జనవరి 24: గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలతో పడి ఉన్న వ్యక్తిని తన వాహనంలో ఆసుపత్రికి తరలించి ఔదార్యం చాటుకున్నారు పాల్వంచ సీఐ వినయ్‌కుమార్ స్థానికుల కథనం ప్రకారం బుధవారం ఉదయం బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజర నుంచి పినపాక పట్టినగర్ వైపు వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఓ వాహనం ఆపకుండా వెళ్ళి పోయింది. దీంతో ద్విచక్రవాహనంపై వస్తున్న యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో పాల్వంచ నుంచి బూర్గంపాడు వస్తున్న పాల్వంచ సీఐ వినయ్‌కుమార్ తన వాహనాన్ని ఆపి పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదంలో గాయపడిన యువకుడికి తీవ్ర రక్తస్రావం అవుతుండటంతో తన వాహనంలో మోరంపల్లి బంజర ప్రాధమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన చికిత్స అందించాలని అక్కడి వైద్య సిబ్బందికి సూచించారు. సకాలంలో స్పందించి ఆసుపత్రికి తరలించిన సీఐ వినయ్‌కుమార్‌ను పలువురు అభినందించారు.



గాయపడిన యువకుడిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

నిలదీసే హక్కు..

ఓటు హక్కుతోనే దక్కు..!

- బాధ్యతగా ఓటరుగా నమోదు చేసుకోవాలి
- నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 24: ప్రజాస్వామ్యం ప్రగతికి ఓటు బాటవ్వాలి అక్రమార్కులకు అంకుశం పోటవ్వాలి. గాడితప్పుతున్న నేతలకు దిద్దుబాటు కావాలి ఒక రోజు వేసే ఓటు ఐదేళ్ల పాలన కోసం కాదు భవిష్యత్తు తరాలకు మనం ఇచ్చే భరోసా అవ్వాలి. మంచి వాళ్ల మౌనం అక్రమార్కులకు ఆయుధం కాకుండా అందరం ఈ హక్కును పొందుదాం.

జనవరి 25నే ఎందుకంటే

స్వాతంత్ర్యం అనంతరం 1950 జనవరి 25న భారత ఎన్నికల సంఘం ఏర్పడింది. సంవత్సరాలు గడుస్తున్నా ఓటుహక్కు నమోదుపై జనం నిర్లక్ష్యంగా ఉండడంతో 2011లో అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రి వర్గం ఎన్నికల సంఘం ఆవిర్భవిం చిన రోజునే జాతీయ ఓటరు దినోత్సవంగా నిర్వహించాలని నిర్ణయించారు. అప్పటి నుంచి ఏటా ఓటు నమోదుకు ప్రత్యేక కార్యక్రమాలు అవగాహన సదస్సులు కొనసాగుతున్నాయి. భారతదేశం సర్వసమానత, సమభావుకత కలగలిపిన సర్వసత్తాక లౌకిక దేశం, ప్రపంచంలోనే అతిపెద్దప్రజాస్వామ్య దేశం మన దేశ ప్రజాస్వామ్యానికి శక్తి, బలం దృఢత్వానికి మూలం భారతఎన్నికల సంఘం. అది నిర్వహించే ఎన్నికలు.

ఓటరుగా నమోదుకు అవకాశం

ఓటరు జాబితాలో పేరును నమోదు చేసుకునేందుకు అర్హులైన ప్రతి ఒక్కరికీ హక్కు ఉంది. భారత ఎన్నికల సంఘం 18 ఏళ్లు నిండిన వారంతా దరఖాస్తు చేసుకునేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించడంతో ప్రతి ఏటా జనవరి 15న కొత్త ఓటర్లను జాబితాలో చేర్చి ప్రదర్శనకు ఉంచుతుంది.

రక్త పరీక్ష కేంద్రంలోనే టీహబ్ ల్యాబ్

- క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖరారు చేసిన ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న పీవో

భద్రాచలం, జనవరి 24: రాష్ట్ర ప్రభుత్వం భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు టీహబ్ రక్త పరీక్ష కేంద్రాన్ని జనవరి 9న మంజూరు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు ఐటీడీఏలకు టీహబ్ ల్యాబ్‌లను మంజూరు చేయగా భద్రాచలం ఏజెన్సీకి ఏరియా వైద్యశాలలో ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, డీఎంహెచ్‌వో డా. శిరీష ఇతర అధికారులు క్షేత్రస్థాయిలో బుధవారం పరిశీలించారు. టీహబ్ ల్యాబ్ మంజూరు కావడంతో ఏరియా వైద్యశాలలో ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై వైద్యశాల ప్రాంగణంలో పలు చోట్ల పరిశీలించిన అధికారులు చివరకు ప్రస్తుతం ఉన్న రక్త పరీక్ష కేంద్రంలోనే టీహబ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చాలని సంబంధిత అధికారులకు పీవో ప్రతీక్‌జైన్ ఆదేశించారు. అనంతరం ఆయన ఏరియా వైద్యశాలను తనిఖీ చేశారు. ఈ సమయంలోడాక్టర్ సంతోష్‌చే కంటి శస్త్ర చికిత్స చేయించుకున్న మణుగూరు ప్రాంతానికి చెందిన భరత్‌కుమార్ అనే బాలున్ని పీవో పరామర్శించారు. ప్రస్తుతం ఆ బాలునికి పరిస్థితి ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. ఇదే సమయంలో వైద్యశాలలో డాక్టర్ల బయోమెట్రిక్ అటెండెన్స్ వివరాలను పీవో అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజ్‌కుమార్, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రామకృష్ణ, ఆర్ఎంవో డాక్టర్ వై.రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆరేళ్లయినా అతీగతీ లేదు

- సంవత్సరాలు గడుస్తున్నా పూర్తికాని ఆడిటోరియం నిర్మాణం
- సమీపిస్తున్న భక్తరామదాసు జయంత్యుత్సవాలు
- పనులు పూర్తయితేనే నూతన ఆడిటోరియంలో..



నేలకొండపల్లి భక్తరామదాసు ధ్యానమందిరం ఆవరణలో నిర్మిస్తున్న ఆడిటోరియం

నేలకొండపల్లి, జనవరి24: నేలకొండపల్లిలోని భక్తరామదాసు జన్మస్థలమైన భక్తరామదాసు ధ్యాన మందిరంలో అభివృద్ధి పనులు ప్రారంభమై నేటికి సరిగ్గా ఆరు సంవత్సరాలు. నిర్మాణ పనులు ప్రారంభమై నేటికి ఆరు సంవత్సరాలు పూర్తి అయినప్పటికీ పనులు మాత్రం పూర్తి కాలేదు. 6సంవత్సరాల క్రితం అప్పటి రోడ్లు, భవనాల శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ధ్యాన మందిరం అభివృద్ధికి దాదాపు రూ.3.50 కోట్లు మంజూరయ్యాయి. అనంతరం అభివృద్ధి పనులను సైతం తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. అధికారుల పర్యవేక్షణ లేక పోవటం, సరైన సమయంలో నిధులు అందక పోవటం ఇతరత్రా, ఇతరత్రా కారణాలతో నిర్మాణ పనులు ఆలస్యంగా నడుస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఇద్దరు, ముగ్గురు కాంట్రాక్టర్లు సైతం మారినట్లుగా తెలుస్తున్నది. అయినప్పటికీ నిర్మాణ పనులో వేగం లేదు. గత 3సంవత్సరాలుగా జయంత్యుత్సవాలకు హాజరవుతున్న జిల్లా అధికారులు వచ్చే సంవత్సరం తప్పనిసరిగా ఉత్సవాలను నూతన ఆడిటోరియంలో నిర్వహించుకుందామని చెప్పటం, అటు తర్వాత పనుల పర్యవేక్షణ మరువటంతో పనులు నత్తనడకనే సాగుతున్నాయి. 2024 రామదాసు జయంత్యుత్సవాలను కూడా నూతనంగా నిర్మించే ఆడిటోరియంలో జరుపుకొంటామనే ఆశ మాత్రం లేదు. శుక్రవారం జిల్లా కలెక్టర్ గౌతమ్ రామదాసు ధ్యాన మందిరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని, జయంత్యుత్సవాలను ఆడిటోరియంలోనే జరుపుకోవాలన్నారు. కానీ పనులను పూర్తి చేసి ఆడిటోరియంలో నిర్వహిస్తారా.. లేక ఎప్పటి మాదిరే ధ్యాన మందిరం ఆవరణలోనే నిర్వహిస్తారా అనేది వేచి చూడాల్సిందే.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ఖమ్మం కలెక్టరేట్ జనవరి 24: నీటిపారుదల శాఖలో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపది కన పనిచేస్తున్న 363 వర్క్ ఇన్‌స్పెక్టర్లను క్రమబద్ధీకరించాలని పలువురు ఉద్యోగులు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, గృహనిర్మాణ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్కకు విన్నవించారు. తెలంగాణ ప్రభుత్వం జీవో నెంబర్ 45,84,43 ప్రకారం ప్రభుత్వం మంజూరు చేసిన 879కిగాను 532 వర్క్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల్లో నీటిపారుదల శాఖలో పనిచేస్తున్న 363 మందిని విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మంత్రులను కలిసిన వారిలో పోలీస్ రాజేందర్‌రెడ్డి, పేర్ల నరేంద్రనాథ్, సీహెచ్ నాగరాజు, ఎం భానుప్రకాష్, వి లక్ష్మీరాజం, రవికుమార్, ఎం.కవిత, ఇందాల్‌సింగ్, మోహన్, జి విఠల్, వినోద్‌కుమార్, నర్సింహులు, మహిపాల్, శ్రీనివాస్, వేణుగోపాల్, బాలకృష్ణ తదితరులున్నారు.

ఎన్నెస్పీకాలువకు నీరు విడుదలచేయాలి

ఖమ్మం సంక్షేమవిభాగం, జనవరి24: నాగార్జున సాగర్ ఎడమ కాల్వకు నీటిని తక్షణమే విడుదల చేసి పంటలను కాపాడాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారావు రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌ను కలిసిన రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందించి సాగులో ఉన్న పంటల వివరాలను తెలియజేశారు. కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి ఆల్మట్టి డ్యామ్ నుంచి తెలంగాణ ప్రాంతానికి సాగునీరు తెప్పించాలని కోరారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి సాగర్, శోభన్‌నాయక్, ఎస్ నవీన్‌రెడ్డి, రాయల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'రెవెన్యూ' వద్ద ఆ భూమి రికార్డుల్లేవ్!

- హైదరాబాద్-శ్రీశైలం హైవే భూమి వివరాలివ్వాలని ఎన్‌హెచ్‌ఏఐకు వినతి
- 'రహదారికీ రైతుబంధు'పై విస్తృత చర్చ
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై అధికారుల ఆరా

ఆమనగల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'రహదారికీ రైతుబంధు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నిర్మించిన భూమికి ప్రభుత్వం ఏళ్లుగా రైతుబంధు సొమ్ము ఇస్తూ వచ్చిన వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. అయితే రోడ్డు నిర్మించిన భూమికి సంబంధించి రెవెన్యూ అధికారుల వద్ద సరైన రికార్డులు లేనట్లు సమాచారం. దాంతో ఆ రికార్డులు అందజేయాలని రెవెన్యూ అధికారులు.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులను కోరినట్టు తెలిసింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో ఈ సమస్య వెలుగుచూసింది. రోడ్డు కోసం పట్టా భూములను సేకరించినా దానికి అనుగుణంగా రికార్డుల్లో మార్పు చేయలేదు. గత ప్రభుత్వ లోపాల వల్ల ఈ భూమికి రైతుబంధు సహాయం అందుతుండడమే కాక మరో సమస్య కూడా తలెత్తుతోంది. భూముల ధరలకు రెక్కలు వస్తుండడంతో చాలామంది రైతులు జాతీయ రహదారి ఉన్న భూమిని కూడా ధరణి రికార్డుల ఆధారంగా విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఇదే జరిగితే పెద్దఎత్తున వివాదాలు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదు. ఇటీవల కడ్తాల- మైసిగండి మధ్య రోడ్డు నిర్మాణం జరిగిన 1.20 ఎకరాల భూమి.. ధరణి పాస్ పుస్తకంలో కూడా ఉండడంతో రూ.5 కోట్లకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దాన్ని వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయకుండా బ్లాక్‌లిస్టులో పెట్టాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు అందింది.



హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి

కాగా, ఎన్‌హెచ్ఏఐ అధికారులను రికార్డులు అడగడంతో పాటు రోడ్డు ఉన్న సర్వే నంబరు భూములను పరిశీలించి సంబంధిత రైతుల రికార్డుల నుంచి ఆ భూమిని తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇటు ప్రభుత్వం ఈ విషయమై ఉన్నతస్థాయి విచారణ జరిపిస్తే అనేక విషయాలు వెలుగుచూసే అవకాశం ఉందన్న అభిప్రాయం స్థానిక ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఆమనగల్లుకు చెందిన ఓ రైతు ఇటీవల స్థానిక తహసీల్దార్‌కు, కడ్తాల్‌కు చెందిన మరో రైతు ప్రజావాణిలో సీఎం రేవంత్ రెడ్డికి ఇదే విషయమై ఫిర్యాదు చేశారు.

కేసీఆర్‌ను సీఎం చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బాధాకరమేమీ కాదని, చాలా చిన్న దెబ్బ మాత్రమే తగిలిందని అన్నారు. "ప్రజలు మనల్ని ఛీకొట్టలేదు. 39 స్థానాల్లో గెలిచాం. మరో 14 స్వల్ప తేడాతో ఓడాం. ఆ 14 స్థానాల్లో ఇతర పార్టీలు గతంలో రెండు, మూడు, నాలుగుసార్లు వరుసగా పోటీచేసి.. ఒక్కసారైనా గెలిపించాలంటూ ఏడవడంతో ప్రజలు భావోద్వేగాలతో వారికి ఓటేశారు. ఇందులో ఆరేడు స్థానాలు బీఆర్ఎస్ గెలిస్తే ఎలా ఉండేది? 1.85 శాతం ఓట్ల తేడాతో మాత్రమే అధికారం కోల్పోయాం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజల తీర్పు ను అవమానపరిచే విధంగా మాట్లాడవద్దని పార్టీ శ్రేణులు, సోషల్ మీడియా వారియర్స్‌కు సూచించారు. "కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్‌లో గెలిచాం. మిగిలిన నాలుగింటిలో కూడా వారు సానుభూతితోనే గెలుపొందారు. అయినా మనకంటే వారికి కేవలం ఐదారు వేల ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చాయి. ఈ ఏడుపు, సానుభూతి ఎప్పటికీ ఉండదు" అని వ్యాఖ్యానించారు.

420 హామీలతో ప్రజలను నమ్మించారు..

ఎన్నికల్లో తప్పుడు హామీలతో రేవంత్‌రెడ్డి ప్రజలను నమ్మించారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలే కాకుండా.. మేనిఫెస్టోలో పేర్కొన్నవన్నీ కలిపి 420 హామీలు ఇచ్చారని, వాటిని ప్రజలకు వివరించి అమలయ్యే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. హామీలు అమలు చేయకుంటే రోడ్డుపై బట్టలూడదీసి ప్రభుత్వాన్ని నగ్నంగా నిలబెడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాను పదునుగా వాడుకొని నరేంద్రమోదీ ప్రధానమంత్రి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. రైతు భరోసా ఇచ్చామంటూ రేవంత్‌రెడ్డి దావో‌స్‌లో పచ్చి అబద్ధం చెప్పారని, రైతుబంధు పేరు మార్చారే తప్ప.. డబ్బులు ఇవ్వలేదని తెలిపారు. రైతుబంధు పడలేదంటే చెప్పుతో కొడతామంటూ మంత్రి కోమటిరెడ్డి చేసిన వాఖ్యలపై



బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ భేటీలో మాట్లాడుతున్న కేటీఆర్

కేటీఆర్ మండిపడ్డారు. రైతు భరోసా రాని70 లక్షల మంది రైతులు ఈ ప్రభుత్వాన్ని చెప్పుతో కొడతారో, ఓట్లతో కొడతారో ఆలోచించుకోవాలన్నారు. క్వింటాల్ ధాన్యానికి ఇస్తామన్న రూ.500 బోనస్ ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. మార్పు కావాలని ఓట్లు వేసిన 6.5 లక్షల ఆటో కార్మికుల కుటుంబాల కొంప కొల్లేరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వారికి ఏ అవకాశమచ్చినా కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎరువులు, విత్తనాల దుకాణాల వద్ద క్యూ కట్టాల్సి వస్తుందని ఎవరూ అనుకోలేదని, మళ్లీ ఆ రోజులు వచ్చాయని విమర్శించారు. బస్సుల సంఖ్యను పెంచకుండా, బస్సుల కండిషన్ ఎలా ఉందో తెలుసుకోకుండా అనాలోచితంగా మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో బస్సుల్లో వారు కొట్టుకుంటున్నారని తెలిపారు. మరోవైపు డబ్బులు పెట్టుకొని వెళ్లే పురుషులకు సీట్లు దొరకడం లేదని, ఎవరూ సంతృప్తిగా లేరని అన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కోటి 57 లక్షల మంది మహిళలకు నెలకు 2,500 ఇవ్వకుంటే తాట తీయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని అసెంబ్లీలో ప్రశ్నిస్తే.. తాము ఆ హామీ ఇవ్వలేదని భట్టివిక్రమార్క అన్నారని చెప్పారు.

మతం, దేవుళ్లతో బీజేపీ రాజకీయం..

బీజేపీ ఎంపీలు మతం, దేవుళ్లతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. నిత్యం మతం, ధర్మం అంటూ రెచ్చగొడుతూ కరీంనగర్‌లో గెలిచిన బండి సంజయ్‌కుమార్ అట్టర్ ఫ్లాప్ ఎంపీ అని విమర్శించారు. వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట రామాలయానికి మోదీ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. ఐదేళ్లలో సంజయ్ చేసిన అభివృద్ధి ఏంటో మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నలుగురు ఎంపీలను ఓడించింది బీఆర్ఎస్ కాదా? రెండు పార్టీలు ఒకటైతే కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోయేవారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోదీ, అదానీ ఒకటేనంటూ రేవంత్, రాహుల్ గాంధీ ప్రచారం చేశారని, ఇప్పుడు ఆయనతోనే ఒప్పందం కుదుర్చుకున్నారని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌లో మోదీ, అదానీ తరువాత.. రేవంత్ మూడో ఇంజన్‌గా మారారన్నారు. కేసీఆర్ సర్కారు పదేళ్లు అదానీని రాష్ట్రంలో అడుగుపెట్టనీయలేదని, అమిత్‌షా, మోదీ సూచనతోనే అదానీతో రేవంత్ ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర సంస్థలను అదానీకి కట్టబెడతారన్నారు. రేవంత్ మరో ఏక్‌నాథ్ షిండే అయినా ఆశ్చర్య పోవలసిన అవసరం లేదని, మైనారిటీలు ఆలోచించాలని సూచించారు.



మీడియాతో ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి

విపక్ష ఎమ్మెల్యేలు సీఎంను కలవకూడదా?


- రేవంత్ తెలంగాణ రాష్ట్రానికి సీఎం కాదా?
- సమస్యల పరిష్కారం కోసమే కలిశాం
- పార్టీని వీడేది లేదు.. ప్రతిపక్షంలోనే ఉంటాం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీత, ప్రభాకర్‌రెడ్డి మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):"కాంగ్రెస్ పార్టీకే.. రేవంత్ ముఖ్యమంత్రా? తెలంగాణకు కాదా? నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష నేతలు సీఎంను కలవకూడదా?" అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కె.మాణిక్‌రావు ప్రశ్నించారు. తాము కాంగ్రెస్‌లో చేరుతున్నామంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. రెండ్రోజుల క్రితం ఈ నలుగురు ఎమ్మెల్యేలూ సీఎం రేవంత్‌ను కలవడంతో వారు పార్టీ మారుతున్నారన్న ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో వారు బుధవారం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగానే కలిశామని, ప్రజాసమస్యలను చర్చించడంతోపాటు సెక్యూరిటీ, ప్రొటోకాల్ సమస్యలపై కూడా మాట్లాడామన్నారు. ప్రతిపక్షంలో ఉంటే సీఎంను, మంత్రులను కలవకూడదా? ప్రధాని మోదీని, కేంద్రమంత్రులను సీఎం రేవంత్ కలవడం లేదా అని ప్రశ్నించారు. తమ నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి అంశాల్లో సహకరించాలని సీఎంను కోరామన్నారు. కాంగ్రెస్ లోకి వెళ్లాల్సిన అవసరం తమకు ఏముందని వారు ప్రశ్నించారు. సీఎంను మాత్రమే కాదని, సమస్యల పరిష్కారం కోసం మంత్రులనూ కలుస్తూనే ఉంటామన్నారు. తమపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆపాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ మారే ప్రసక్తే లేదని.. ప్రతిపక్షంలోనే ఉండి పోరాడతామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్సే మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని అన్నారు.

రాహుల్ ప్రజల్లోకి వెళ్తుంటే బీజేపీకి ఎందుకంత భయం?

- గుడికి వెళ్లడానికీ అసోం సీఎం అనుమతి కావాలా?
- అప్పట్లో బతుకమ్మ పేరుతో కవిత మాదిరిగానే ఇప్పుడు రామాలయం పేరుతో మోదీ సినిమా చూపిస్తున్నారు..
- అయోధ్య గుడికి కారకుడైన అడ్వాణీని సన్మానించారా?: జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): "రాహుల్‌గాంధీ ప్రజల్లోకి వెళుతుంటే.. బీజేపీకి ఎందుకంత భయం? రాహుల్ గాంధీ గుడికి పోవద్దా? అందుకు అసోం సీఎం అనుమతి తీసుకోవాలా?" అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రశ్నించారు. అసోం ప్రజలకు ఇబ్బంది లేకుండా రాహుల్‌గాంధీ పాదయాత్ర సాగుతోందని, అయితే ప్రధాని మోదీ దగ్గర మెప్పు కోసమే పాదయాత్రను అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ అడ్డుకున్నారని



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

ఆరోపించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని యాత్ర చేయకుండా అడ్డుకునే కుట్రను బీజేపీ చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. మోదీ పాలనలో న్యాయమైన పాలన జరగట్లేదని, ధరల పెరుగుదలకూ అడ్డూ అదుపూ లేకుండా పోతోందని విమర్శించారు. దీనిపై ప్రజలను సంఘటితం చేసే పనిలో భాగంగా రాహుల్‌గాంధీ 'న్యాయ్ యాత్ర'ను చేపట్టారని, అసోంలో రాహుల్ యాత్రను బీజేపీ వాళ్లు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అసోం ప్రభుత్వం అక్కడ శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తోందని ఆరోపించారు. నిన్న మొన్నటిదాకా బతుమ్మ పండుగే లేనట్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బతుకమ్మ పేరుతో సినిమా చూపించిందని, ఇప్పుడు ప్రధాని మోదీ.. రామాలయం పేరుతో సినిమా చూపిస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు ఈ మధ్యనే కళ్లు తెరిచి.. రాములవారిని మొక్కాలని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. "రాములవారు పుట్టిన తర్వాత బీజేపీ పుట్టిందా? బీజేపీ పుట్టిన తర్వాత దేవుడు పుట్టాడా? ఆ పార్టీ పుట్టి కేవలం 40 ఏళ్లు అవుతుంది. సీతమ్మ, రాముల వారు పుట్టి నాలుగు యుగాలవుతోంది. ప్రధాని మోదీ, ఇక్కడి బీజేపీ నేతలు సీతారాముల కల్యాణం చేస్తారో లేదో తెలియదు నేను. మాత్రం ప్రతియేటా చేస్తాను" అని వ్యాఖ్యానించారు. అయోధ్య గుడికి అసలు కారకుడు బీజేపీ సీనియర్ నేత అడ్వాణీ అని, ఆయన దేశమంతా తిరిగి అయోధ్యలో రామాలయం కట్టాలని ప్రచారం చేశారని చెప్పారు. అలాంటి అడ్వాణీని కనీసం సన్మానించారా? అంటూ బీజేపీ నేతలను నిలదీశారు. సొంత పార్టీ నేత అడ్వానీ త్యాగమే గుర్తించని బీజేపీ.. కాంగ్రెస్ పార్టీ నేతల త్యాగం గుర్తిస్తుందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను ఎందుకు కలిశారో తనకు తెలియదు కానీ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎంను ఎమ్మెల్యేలు కలవాలంటే కుదిరేది కాదన్నారు. గత తొమ్మిదేళ్లలో దక్కని అవకాశాన్ని సీఎం రేవంత్ 2 నెలల్లోనే కల్పించారన్నారు. గత తొమ్మిదేళ్లుగా చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

ఈసీ ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

- అమోయ్‌కుమార్, సుశీల్‌కుమార్, శ్రీధర్‌లకు బాధ్యతలు..

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పోస్టింగులు ఇచ్చింది. ఈమేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. వేటు పడిన అధికారులకు అప్రాధాన్య పోస్టింగులు ఇవ్వడం గమనార్హం. అలాగే సుదీర్ఘకాలం పాటు సింగరేణి సంస్థ సీఎండీగా పని చేసి, ఇటీవల బదిలీ అయి వెయిటింగ్‌లో ఉన్న ఎన్.శ్రీధర్‌కు కూడా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఆయన్ను షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చూస్తున్న సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. ఈసీ ఆదేశాలతో పోస్టింగ్‌లు కోల్పోయి, వెయిటింగ్‌లో ఉన్న డి.అమోయ్‌కుమార్‌ను పశు సంవర్ధక శాఖ జాయింట్ సెక్రటరీగా, టి.వినయ్‌కృష్ణారెడ్డిని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీగా, ఎస్.హరీశ్‌ను రవాణా, రోడ్లు-భవనాల శాఖ జాయింట్ సెక్రటరీగా ప్రభుత్వం నియమించింది. గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్న పి.కాత్యాయనిదేవిని బదిలీ చేసి తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(టీఎస్ఐఆర్‌డీ) సీఈఓగా నియమించింది. ఈ పోస్టు అదనపు బాధ్యతలు చూస్తున్న పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను రిలీవ్ చేసింది. అలాగే వెయిటింగ్‌లో ఉన్న నాన్-కేడర్ అధికారి సుశీల్‌కుమార్‌ను గనుల శాఖ డైరెక్టర్‌గా నియమించింది.

మే నెలలో ఎంసెట్.. నేడు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే మే నెలలో ఎంసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలకానుంది. ఎంసెట్‌తోపాటు రాష్ట్రంలో నిర్వహించే ఇతర ప్రవేశ పరీక్షల షెడ్యూళ్లను కూడా ఇదే రోజున అధికారులు విడుదల చేయనున్నారు. ఈ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఆమోదం తెలిపారు. ఎంసెట్‌తోపాటు లాసెట్, ఐసెట్, ఈసెట్ వంటి ప్రవేశ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. ఈ సెట్ల షెడ్యూల్‌ను ముందుగానే విడుదల చేస్తే అందుకనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావడానికి అవకాశముంటుంది. అధికారులు కూడా ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు చేసుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో ఆయా సెట్లను నిర్వహించే కమిటీలు, కన్వీనర్లను కూడా ప్రకటించనున్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామక ఫైల్‌ను

సత్వరం ఆమోదించండి

తమిళిసైతో సీఎం, డిప్యూటీ సీఎం భేటీ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌తో భేటీ అయ్యారు. ప్రభుత్వం తరఫున నిర్వహించే గణతంత్ర దినోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ఆమెను ఆహ్వానించారు. గవర్నర్‌తో 20 నిమిషాలపాటు ప్రత్యేకంగా సాగిన సమావేశంలో.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామకం, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లపై చర్చించినట్టు సమాచారం. టీఎస్‌పీఎస్సీకి చైర్మన్‌ను నియమించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్న ప్రభుత్వం.. రెండు రోజుల క్రితమే దానికి సంబంధించిన ఫైల్‌ను పంపింది. దానికి సత్వరం ఆమోదం తెలపాలని సీఎం, డిప్యూటీ సీఎం ఈ భేటీలో గవర్నర్‌కు విజ్ఞప్తి చేసినట్టు తెలిసింది. ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే సభ్యులకు సంబంధించిన జాబితాను కూడా పంపిస్తామని చెప్పినట్టు సమాచారం. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నందున ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు వారు గవర్నర్‌కు వివరించారు. తమిళిసై కూడా దీనికి సంబంధించి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నట్టు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఇక గవర్నర్ కోటా ఎమ్మెల్సీల విషయానికి వస్తే.. గత ప్రభుత్వం దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించగా, వారిని నామినేట్ చేయడానికి తమిళిసై నిరాకరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ కోటాలో నియమితులయ్యేవారు సాహిత్యం, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, సమాజ సేవ వంటి రంగాల్లో నిష్ణాతులై ఉండాలి. ఈ అర్హతలు లేవంటూ దాసోజు, కుర్ర పేర్లను గవర్నర్ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో.. రేవంత్ సర్కారు ఆ కోటా కింద ఇద్దరి పేర్లను ప్రతిపాదిస్తూ ఫైల్‌ను గవర్నర్‌కు పంపాలని భావించింది. అయితే ఈలోగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ కోర్టుకు వెళ్లారు. తమ పేర్లను తిరస్కరించడం చట్టవిరుద్ధమని.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా తమను నామినేట్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని వారు కోర్టును



రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

కోరారు. దీంతో.. ఈ విషయం కోర్టులో ఉన్నందున తాను నిర్ణయం తీసుకోలేనని రేవంత్ సర్కారుకు గవర్నర్ స్పష్టం చేశారు. తాజాగా బుధవారం ఈ కేసును అడ్మిట్ చేసుకున్న న్యాయస్థానం.. ఎమ్మెల్సీలుగా కొత్త ప్రభుత్వం ప్రతిపాదించినవారిని గవర్నర్ నామినేట్ చేయకుండా స్టే ఇవ్వడానికి నిరాకరించింది. కాబట్టి ఈ ప్రక్రియపై ముందుకు వెళ్లొచ్చనే అభిప్రాయంలో ఉన్న ప్రభుత్వం.. ఆ విషయాన్ని గవర్నర్‌కు తెలిపింది. తాము ఈ కోటాకు అర్హులైన వ్యక్తులనే సిఫారసు చేస్తామని రేవంత్, భట్టి బుధవారం భేటీలో తమిళిసైకి వివరించగా.. దీనిపై న్యాయసలహా తీసుకుంటానని ఆమె చెప్పినట్టు తెలిసింది. ఫిబ్రవరి 2వ వారంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు నిర్వహించే ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో రేవంత్, భట్టి ఆ విషయాన్ని కూడా గవర్నర్ వద్ద ప్రస్తావించినట్టు సమాచారం. కాగా.. గత కేసీఆర్ సర్కారు తీరుకు భిన్నంగా గణతంత్ర దినోత్సవాలకు గవర్నర్‌ను నేరుగా కలిసి ఆహ్వానించిన సీఎం, డిప్యూటీ సీఎం.. గవర్నర్ ప్రసంగానికి సంబంధించిన విషయాలను కూడా వివరించారు.

దేవాలయాల చైర్మన్లకు సన్మానం



మధిరటౌన్, జనవరి24: అయోధ్యలో రామాలయం ప్రతిష్ఠ సందర్భంగా మధిరలోని పలు దేవాలయాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినందుకు బీజేపీ, అయోధ్య తీర్థట్రస్ట్ ఆధ్వర్యంలో దేవాలయాల చైర్మన్లను బుధవారం సన్మానించారు. అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా దేవాలయాలలో పూజలు, భజనలు నిర్వహించడమే కాకుండా, టీవీలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏలూరి నాగేశ్వరరావు, ట్రస్ట్ సేవకులు మాదిరాజు దుర్గాప్రసాద్, రాజేశ్వరశర్మ, సిలివేరు సాంబశివరావు, పాపట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైరా-జగ్గయ్యపేట రోడ్డు అభివృద్ధికి గ్రీన్‌సిగ్నల్

- రూ.12కోట్ల నిధులు మంజూరు
- చురుగ్గా పనులు

వైరా,జనవరి24: వైరా-జగ్గయ్యపేట, మధిర రోడ్డు అభివృద్ధికి అడ్డంకులు తొలగిపోయాయి. అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు ఈ రోడ్డు అభివృద్ధికి టీఎస్ఎస్‌డీఎఫ్ నుంచి రూ.12కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో టెండర్ల ప్రక్రియ పూర్తయినప్పటికీ కాంట్రాక్టర్ అగ్రిమెంట్ విషయంలో కొంత జాప్యం జరగడంతో ఎన్నికల కంటే ముందు అభివృద్ధి పనులు మొదలుకాలేదు. అంటే గత ఏడాది నవంబరు 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఓటమిపాలై కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. అయితే గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఆర్అండ్‌బీ పనులను ప్రభుత్వం నుంచి అధికారులకు మౌఖిక ఆదేశాలొచ్చాయి.

పనుల ప్రారంభానికి చురుగ్గా ఏర్పాట్లు...

వైరాలోని క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ ప్రధాన రహదారి నుంచి జగ్గయ్యపేట, మధిర వెళ్లే ఈ రోడ్డును 1.7 కిలోమీటర్ల దూరం నాలుగులైన్ల రోడ్డుగా అభివృద్ధి చేయనున్నారు. అలాగే రోడ్డు మధ్యలో డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, రెండువైపులా డ్రెయినేజీ నిర్మిస్తారు. ఇదే రోడ్డులో గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మించటమేకాకుండా ఎగ్జిట్ కూడా ఏర్పాటు చేశారు. తెలంగాణ-ఏపీ రాష్ట్రాలతోపాటు ఇతర అనేక రాష్ట్రాలకు వెళ్లేందుకు ఈ రోడ్డు కీలకంగా ఉంది. భద్రాచలం, కొత్తగూడెం, ఛత్తీస్‌ఘడ్, మణుగూర్ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు ఈ రోడ్డు నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవేకు వెళ్లాల్సి ఉంది. దాంతో ఈ రోడ్డును అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకతను ప్రభుత్వం గుర్తించింది.

భారీ చెట్ల నరికివేత...

ఈ రోడ్డు అభివృద్ధి కోసం అనేక దశాబ్దాలకు చెందిన భారీ చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికివేస్తున్నారు. లక్షలాది రూపాయలు విలువయ్యే ఈ చెట్లకు అటవీశాఖ నిర్ధారించిన రేట్ల మేరకు అని చెపుతూ కాంట్రాక్టర్ కేవలం రూ.2.51లక్షల పైచిలుకు చలానాలు మాత్రం ప్రభుత్వానికి చెల్లించారు. అయితే ఈ చెట్ల నరికివేత ద్వారా వచ్చే కలప అంతకుమించి అనేక రెట్లు విలువ చేస్తుందని స్థానికులు చెబుతున్నారు. చెట్ల నరికివేత సమయంలో రెండురోజుల నుంచి ఈ రోడ్డుపైన వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. నాలుగులైన్ల రోడ్డు చేసే దానిలో భాగంగా త్వరలో కరెంట్ స్తంభాలను తొలగించనున్నారు.



వైరా-జగ్గయ్యపేట ఆర్అండ్‌బీ రోడ్డు

విద్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లిరూరల్, జనవరి24: గురుకుల పాఠశాలలో విద్య బోధనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సత్తుపల్లి మునిసిపాలిటీ గుడిపాడు రోడ్‌లోని తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల, జూనియర్ కళాశాలలో ఈ విద్యాసంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల పోస్టర్‌ను బుధవారం ఆమె క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. పాఠశాలలో 6,7,8 తరగతుల్లో చేరేందుకు 6వ తేదీ లోపు టీఎంఆర్ఈఐఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 7331170864, 8328111525నంబర్లను సంప్రదించాలని కోరారు.

ర్యాంకర్లకు సన్మానం

చరిత్ర పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గతేడాది ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించిన హెచ్ఈసీ విద్యార్థిని దాసరి సిరిన చరిత్ర ప్రతిభ పురస్కారం-23తో పాటు రూ.3వేల నగదు పురస్కారాన్ని రాగమయి అందజేశారు. రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన టీ.విషయ, పీ.అంజలి, ఎం.మౌనికలను పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో సుల్తానా రజియా, కొచ్చెర్ల శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మీ, విజయలక్ష్మీ, సత్యనారాయణ పాల్గొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆర్‌కే ఫౌండేషన్ బాధ్యుడు ఇనపనూరి రాధాకృష్ణను ఎమ్మెల్యే పరామర్శించారు. యువసేవా సమితి ఆధ్వర్యంలో సేకరించిన రూ.30,110 సహాయాన్ని రాధాకృష్ణకు అందజేశారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిని ప్రమాద రహిత డిపోగా మార్చాలి

రూరల్ ఎస్ఐ కుశకుమార్

సత్తుపల్లిరూరల్, జనవరి24:సత్తుపల్లి ఆర్టీసీడిపోను ప్రమాదరహిత డిపోగా తయారు చేయాలని రూరల్ ఎస్ఐ కుశకుమార్ అన్నారు. డ్రైవర్స్‌డే సందర్భంగా బుధవారం సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో ఉదయం ప్రారంభమైన బస్సు నుంచి చివరి ప్రయాణం చేసే డ్రైవర్ వరకు ప్రతిఒక్కరికీ పువ్వులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. 27ఏళ్ల పాటు ఎటువంటి ప్రమాదం లేకుండా విధులు నిర్వహించిన స్థానిక ఎన్టీఆర్ నగర్‌కు చెందిన రాజధాని ఏసీ బస్ డ్రైవర్ ఏవీఎస్.రావును అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, ఎంఎఫ్ శిలివేరు సాహితిని శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో వీడీ.రెడ్డి, కాంతారావు, డీఐ ప్రభాకర్, ఏడీసీలు తిరుపతయ్య, చిన్నపరెడ్డి, జగన్నాధం, రామ్‌కుమార్, కిన్నెర ఆనందరావు పాల్గొన్నారు.

ఏన్కూరు: అతివేగమే రోడ్డు ప్రమాదాలకు కారణమని సత్తుపల్లి ప్రాంతీయ రవాణ అధికారి ఎంవీ పుల్లయ్య తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతావారోత్సవాల సందర్భంగా బుధవారం ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమంల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుందరం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధిరటౌన్: డ్రైవర్లు విధినిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని మధిర టౌన్ ఎస్ఐ రాజేష్, ఆర్టీసీ ట్రాఫిక్ ఇంచార్జ్ రఘుబాబు కోరారు. బుధవారం మధిర ఆర్టీసీ డిపోలో డ్రైవర్స్ డే సందర్భంగా డ్రైవర్లను పూలు, స్వీట్లు ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ దేవదానం, ట్రాఫిక్ ఇన్‌చార్జ్ రవి కుమార్ పాల్గొన్నారు.



డ్రైవర్‌కు గులాబీ పువ్వు అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్ఐ కుశకుమార్

సత్తుపల్లి కోర్టులో షటిల్ కోర్టు ప్రారంభం

సత్తుపల్లిరూరల్, జనవరి24: సత్తుపల్లి కోర్టులో నూతనంగా ఏర్పాటు షటిల్ కోర్టును సీనియర్ సివిల్ జడ్జీ పీ.అరుణకుమారి బుధవారం ప్రారంభించారు. కోర్టు ఉద్యోగులు, న్యాయవాదులు టెన్నిస్, క్యారమ్స్, షటిల్, చెస్, పాటల పోటీలు ప్రారంభమవ్వగా నేడు జేవీఆర్ క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలు సాగనున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీ ఎస్‌కే.అయేషాషరీన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలపాటి శ్రీనివాసరావు, గేమ్స్ సెక్రటరీ ఎన్.విజయ్‌కుమార్, జేవీ.నరేంద్రతో పాటు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గర్ల్స్ హైస్కూల్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు

నేషనల్ గర్ల్స్‌ఛైల్డ్ డే సందర్భంగా సత్తుపల్లి మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు, హక్కులు, బాలికల చదువుపైనా అవగాహన కల్పించారు. కార్య క్రమంలో హెచ్ఎం నాగేశ్వరరావు, బార్ అసోసియేషన్ సెక్రటరీ బొర్రా వెంకట్రావ్, న్యాయవాదులు నల్లగట్ల విజయ్ కుమార్, కిరణ్‌రంజని, జీనత్, కిషోర్ పాల్గొన్నారు.

విద్యాలయాల్లో ఘనంగా క్రీడోత్సవాలు ప్రారంభం

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి24: నగరంలోని విన్‌ఫీల్డ్ పాఠశాలలో బుధవారం 9వ వార్షిక క్రీడోత్సవాన్ని ఘనంగా ప్రారంభించారు. పాఠశాల యాజమాన్యం మన్నె కిషోర్ కుమార్, పోలవరపు శ్రీకాంత్, గద్దె పుల్లారావు బెలూన్లను గాలిలోనికి వదిలి ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ క్రీడలు రెండు రోజుల పాటు కొనసాగుతాయన్నారు. విజేతలకు రిపబ్లిక్ డే రోజున బహుమతులు అందజేస్తామన్నారు. మమతా రోడ్ నందు గల ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 2వ వార్షిక క్రీడో త్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమాన్ని జిల్లా యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ పి.అనిల్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. త్రివేణి పాఠశాలలో జరిగిన పోటీలను టూటౌన్ సీఐ కుమారస్వామి ప్రారంభించారు. పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, సీఆర్‌ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి గాల్లోకి బెలూన్లు వదులుతున్న విన్‌ఫీల్డ్ పాఠశాల యాజమాన్యం

ఎస్‌బీఐటీలో ముగిసిన శిక్షణ

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి 24: నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో పైతాన్ ప్రోగ్రామింగ్ పై 5రోజులుగా జరుగుతున్న శిక్షణ బుధవారంతో ముగిసింది. బేసిక్ నుండి అడ్వాన్స్ టాపిక్ పై, ప్యాకేజెస్, డిక్షనరీస్, ఆబ్జెక్ట్ ఓరియెంటెడ్ ప్రోగ్రామింగ్‌పై శిక్షణను ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ సాంకేతికతను తమ విద్యార్థులు అందిపుచ్చుకోవాలనే ఉద్దేశ్యంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తునట్లు తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి. ధాత్రి ,కళాశాల ప్రిన్సిపాల్ జి. రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిటాల రవికి ఘన నివాళి

నివాళులర్పించిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, జనవరి24: వైరాలో బుధవారం దివంగత మాజీ మంత్రి పరిటాల రవి వర్ధంతిని కాంగ్రెస్ యువనేత చెరుకూరి కిరణ్ ఆధ్వర్యంలో వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో అలాగే తెలుగుదేశం పార్టీ నాయకులు ఆపార్టీ కార్యాలయంలో వేర్వేరుగా నిర్వహించారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఆర్టీసీ బస్టాండ్‌లో చెరుకూరి కిరణ్ ఏర్పాటుచేసిన పరిటాల వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. రవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బస్టాండ్లోని ప్రయాణికులకు ఎమ్మెల్యే అల్పాహారాన్ని పంపిణీ చేశారు. సమీపంలోనే ఉన్న కాంగ్రెస్ నాయకుడు కట్ల సంతోష్ ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైరా మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకూరి చలపతిరావు, మండల, పట్టణ అధ్యక్షులు కిలారు సురేందర్, మన్నేపల్లి ప్రదీప్, మాజీ వైస్‌ఎంపీపీ కట్ల రంగారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ బీడీకే.రత్నం, చెరుకూరి కిరణ్, పొదిల హరినాథ్, మిట్టపల్లి నాగి, పణితి శ్రీను, కన్నెగంటి హుస్సేన్, మద్దిని రామారావు, కర్నాటి హన్మంతరావు పాల్గొన్నారు.

మామిళ్లగూడెం: టీడీపీ నాయకులు, పరిటాల రవి 19 వ వర్ధంతిని పార్టీ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కేతినేని హరిష్ ఆధ్వర్యంలో పరిటాల రవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా పరిటాల రవి చేసిన సేవలు శ్లాఘనీయమన్నారు. కార్యక్రమంలో వాసిరెడ్డి భాస్కరరావు, పద్మనాభుల నారాయణరావు, కూచిపూడి జై, కన్నేటి పృథ్వి, నాగండ్ల లక్ష్మణ్, కొలికొండ మురళి, పెండ్యాల వెంకట నర్సయ్య, చింతనిప్పు నాగేశ్వరరావు, బైరు అప్పారావు, బోడేపూడి రవి, గంగవరపు అనంతకుమార్, దామళ్ల శివ ప్రసాద్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



రవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఘనంగా ప్రపంచ బాలిక దినోత్సవం

కల్లూరు, జనవరి 24 ప్రపంచ బాలిక దినోత్సవాన్ని కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. మండలంలోని బత్తులపల్లి, పుల్లయ్యబంజరు గ్రామాల్లో ఉన్నత, అంగన్వాడి కేంద్రాల్లో ప్రత్యేకంచి బాలికలకు క్రీడ పోటీలు నిర్వహించారు. బాలికల చదువు గురించి తల్లిదండ్రులకు అవగహన కల్పించారు. అనంతరం విజేతలైన బాలికలకు బహుమతులందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు శ్రీదేవి, అరుణగాంధీ పాల్గొన్నారు.

గొల్లపూడిలో జాతీయ బాలికా దినోత్సవం

వైరా: మండలంలోని గొల్లపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఐరన్ టాబ్లెట్లు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు విజయ్ బాబు, సూపర్‌వైజర్ షేక్.బీ జాన్‌బీ పాల్గొన్నారు.

కొణిజర్ల: మండలంలోని చిన్నగోపతి, పెద్దగోపతి ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పారాలీగల్ వాలంటీర్ కోయిన్ని శంకర్‌రావు కరపత్రాలను పంపిణి చేశారు.

ఖమ్మంలీగల్: జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో బుధవారం పలుచోట్ల న్యాయ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా ఆధ్వర్యంలో పలు విద్యాసంస్థలలో బాలికలకు వివిధ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



విజేతలకు బహుమతులందిస్తున్న ఐసీడీఎస్ ఎస్‌వో

వానరాల గలాటతో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్

గంట పాటు కరెంట్ కష్టాలు

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి24: వానరాల గలాట ప్రజలకు కరెంట్ కష్టాలను తెచ్చిపెట్టాయి. రెండు జట్లుగా విడిపోయి రాత్రి సమయంలో ఘర్షణకు దిగాయి. ఈక్రమంలో కొన్ని కోతులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడటంతో షార్ట్‌సర్క్యూట్ జరిగింది. ఫలితంగా గంటపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.. ఖమ్మంనగరంలోని బాలపేట విద్యుత్ ఫీడర్ పరిధిలో బల్లేపల్లి ప్రధాన రహదారి వెంట బుధవారం రాత్రి రెండు వానరాలు గుంపు ఒకదానిపై మరొకటి దాడికి దిగాయి. ఈ క్రమంలో ఒక గుంపువెళ్లి సమీపంలోనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడటంతో షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో బాలపేట విద్యుత్ ఫీడర్‌లోని బల్లేపల్లి, జయనగర్ కాలనీ, అమరావతినగర్, ఖానాపురం వరకు గంట పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

మాదిగలకు ఎంపీస్థానాలు కేటాయించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి24: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు రెండు పార్లమెంట్ , రెండు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను మర్యాదపూర్వకంగా బుధవారం హైదరాబాదులో కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించారు.

రేషన్‌దారుల ఈ-కేవైసీ వంద శాతం పూర్తి చేయాలి

చింతకాని జనవరి 24: రేషన్‌కార్డు లబ్ధిదారులకు సంబంధించిన ఈ-కేవైసీ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మధుసూదన్ నాయక్ సూచించారు. మండల పరిధిలోని పలు రేషన్‌దుకాణాలను ఆయన తనఖీ చేశారు. గోడౌన్ స్టాక్‌ను పరిశీలించి రికార్డులను తనఖీ చేశారు. రేషన్ బియ్యం పక్కదారిపడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల చివరి వరకు ఈ-కేవైసీను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో చందన్‌కుమార్, పౌరసరఫరాల శాఖ డీటీ విజయ్‌బాబు, డీటీ తహసీల్దార్ చింతకాని వీరభద్రం నాయక్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్

కొణిజర్ల,జనవరి24:ప్రజలు కోరుకున్న సుపరిపాలనను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని, ఆ విధంగానే ముందుకు అడుగులు వేస్తుందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. బుధవారం కొణిజర్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోసు మధు, స్థానిక కొణిజర్ల సర్పంచ్ సూరంపల్లి రామారావు, తహసీల్దార్ తఫ్జల్ హుస్సేన్, ఎంపీడీవో మహాలక్ష్మీ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆరుగ్యారంటీలు తప్పక అమలుచేస్తాం

ఏన్కూరు: ప్రభుత్వం ఆరుగ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తుందని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ధీమా వ్యక్తం చేశారు. రైతువేదికలో బుధవారం కళ్యాణలక్ష్మీ చెక్కులను లబ్దిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆరెం వరలక్ష్మీ, వైస్ ఎంపీపీ పాశం శ్రీనివాసరావు, మండలపార్టీ అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, ఏబ్లాక్ అధ్యక్షుడు వేముల కృష్ణప్రసాద్, ఎంపీటీసీలు స్వర్ణ శిరీష, చీరాల కృష్ణవేణి, లచ్చిరామ్ నాయక్, తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో వేణుమాధవ్ పాల్గొన్నారు.

26, 27 తేదీల్లో ప్రియదర్శిని విద్యాసంస్థల సృజనోత్సవ్

ఖమ్మం రూరల్, జనవరి 24: ప్రియదర్శిని విద్యాసంస్థల సృజనోత్సవ్-2024 జాతీయ స్థాయి టెక్నో కల్చరర్ ఫెస్ట్ ఈనెల 26,27తేదీల్లో నిర్వహించనున్నట్లు విద్యాసంస్థల అధినేత కాటేపల్లి నవీన్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని సాయిప్రభాత్ నగర్‌లోని ప్రియదర్శిని యంత్రవిద్య మహిళా కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఈనెల 27వ తేదీ ముగింపు వేడుకకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య టి.రమేష్ హాజరవుతారని తెలిపారు.

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ



బోనకల్, జనవరి 24: మండలంలోని గార్లపాడు గ్రామం వద్ద మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో తాగునీటి వృధా జరిగింది. వత్తిడి ఎక్కువ కావడంతో ఎయిర్ పైపుకు లీకేజీ ఏర్పడింది. రెండు గంటల పాటు ఫౌంటెన్‌ను తలపించేలా ఎక్కువ ఎత్తులో నీరు బయటకు వచ్చింది. దగ్గరలో గల మొక్కజొన్న పొలంలో నీటి వత్తిడికి పైరు కొట్టుకుపోయింది.

బాలకు హెరిటేజ్ ఫౌండేషన్ ఆహ్వానం

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి24: బాలు చారిటబుల్ ట్రస్టు సేవా కార్యక్రమాలు గుర్తించి ట్రస్టు చైర్మన్ చెరుకుపల్లి బాలును హైదరాబాదులోని హెరిటేజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే శిక్షణకు ఆహ్వానం పంపారు. సోమ,మంగళవారాల్లో కార్యక్రమం జరగనున్నది.

గుండెపోటుతో వార్డుసభ్యురాలి మృతి

పెనుబల్లి, జనవరి 24: పెనుబల్లి గ్రామపంచాయతీ 8వ వార్డు సభ్యురాలు పిల్లపల్లి వెంకటపద్మావతి (37) బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆమె భర్త, ఇద్దరు పిల్లలున్నారు.

ఎంపీ వద్దిరాజుకు జన్మదిన సత్కారం

ఖమ్మం, జనవరి 24: రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పుట్టిన రోజు సందర్భంగా ఖమ్మం చాంబర్‌ఆఫ్ కామర్స్ తరఫున ఘనంగా సత్కరించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ అధ్యక్షుడు మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, కోల్డ్ స్టోరేజీ శాఖ అధ్యక్షుడు మలిశెట్టి వెంకటేశ్వర్లు కలిసి శాలువా, బొకేతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షతు తెలిపారు.

సీపీఐ సభ్యత్వ నమోదు ప్రారంభం

సత్తుపల్లిరూరల్, జనవరి24: సీపీఐ సభ్యత్వ నమోదులో భాగంగా బుధవారం సత్తుపల్లి మునిసిపాలిటీలోని కృషీ బైపాస్ రోడ్‌లో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కోలేటి వెంకటేశ్వరరావు, రాము, వెంకటమ్మ, కృష్ణ, రమేష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చాంబర్ సీనియర్ సభ్యుడు గురునాధం కన్నుమూత

ఖమ్మం వ్యవసాయం, జనవరి 24: ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ దాల్ మిల్ శాఖ సీనియర్ సభ్యుడు మిట్టపల్లి గురునాధం(85) బుధవారం కన్నుమూశారు. చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ అధ్యక్షుడు మేళ్లచెరువు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణయ్య, సెంట్రల్ ఈసీ సభ్యులు పాయల నాగేశ్వరరావు, విడాల శ్రీనివాసరావు, వెండి బంగారంశాఖ సభ్యులు రాయపూడి వెంకట రామారావు, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ కోశాధ్యక్షులు తూములూరి లక్ష్మీనరసింహారావు, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ కోశాధ్యక్షుడు పులఖండం రమేష్ సందర్శించి నివాళులర్పించారు.

3న కల్లూరులో ఉపాధి హామీ ప్రజా వేదిక

కల్లూరు,జనవరి24: మండల పరిషత్ కార్యాలయంలో 3న ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీవో తెలిపారు.

26 నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

ఖమ్మంసాంస్కృతికం, జనవరి24: త్యాగరాజ ఆరాధనోత్సవాలు ఈనెల26 నుంచి30 వరకు ఖమ్మంలోని గుంటుమల్లేశ్వరస్వామి దేవాలయం పక్కనగల భారతీ తీర్థ ప్రవచన మండపంలో జరుగుతాయని త్యాగరాజ స్వామి సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్‌కే దర్గా సైదులు ఒక ప్రకటనలో తెలిపారు.

నర్సరీలను పరిశీలించిన ఏపీడీవో

వైరా, జనవరి24: మండలంలోని పాలడుగులోని పల్లెప్రకృతి నర్సరీలను డీఆర్‌డీఏ ఏపీడీవో శ్రీదేవి బుధవారం పరిశీలించారు. నర్సరీలో పగిలిన వాటర్ ట్యాంకును తొలగించి కొత్త ట్యాంకును ఏర్పాటుచేసి మొక్కలకు నీరందించాలని ఆదేశించారు. వైరా ఏపీవో అనురాధ, పంచాయతీ కార్యదర్శి కుమార్ పాల్గొన్నారు.

పది ఫలితాల్లో విద్యార్థులు రాణించాలి

హెచ్‌ఎంలతో డీఈవో సమీక్ష

కల్లూరు,జనవరి24: ఈఏడాది పదోతరగతి ఫలితాల్లో మెరుగైన సాధించాలిని జిల్లా విద్యాశాఖ అధికారి ఎ సోమశేరశర్మ కోరారు. కల్లూరు బాలికోన్నత పాఠశాలలో బుధవారం హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక బాలుర ఉన్నత, చెన్నూరు జడ్పీ పాఠశాలను కూడా సందర్శించారు.

అనాసాగరంలో బోరు వేయించిన ఎల్‌ఐసీ

నేలకొండపల్లి, జనవరి24:ఎల్‌ఐసీ బీమా గ్రామం కింద మండల పరిధిలోని అనాసాగరంలో జీవిత బీమా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రూ.50వేల ఖర్చుతో తాగు నీటి కోసం బోరును ఏర్పాటు చేశారు. అనాసాగరం గ్రామంలో పాలసీలు ఉన్నందున బీమా గ్రామంగా ఎంపిక చేశామని జీవిత బీమా ప్రతినిధి గెల్లా వెంకటరమణ గుప్తా చెప్పారు.

హెచ్‌ఐవీపై అవగాహన

పెనుబల్లి, జనవరి 24: వైఆర్‌డీకే లింక్ వర్కర్స్ టీం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండాలపాడు అంగన్ వాడీ కేంద్రంలో బుధవారం హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.

మొక్కజొన్న పంట పరిశీలన

ఎర్రుపాలెం జనవరి 24: మండంలోని రాజుపాలెం, తాటిగూడెం గ్రామాల్లో గల మొక్కజొన్న పంటలను హైదరాబాద్ జయశంకర్ వ్యవసాయ యూనివర్శిటీ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. కత్తెర పురుగు ఆశించినట్లు గమనించామని ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.భద్రు తెలిపారు. దీని నివారణకు క్లోరంట్రానిపోల్ మందును 80మిల్లీ ఎకరానికి 200లీ నీటిని కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు బి.మల్లయ్య, ఏవో విజయభాస్కర్‌రెడ్డి, రాజుపాలెం సర్పంచ్ బూసిపల్లి వెంకటరెడ్డి, సొసైటీ చైర్మన్ వెన్నెపూస కృష్ణారెడ్డి, ఏఈవోలు పాల్గొన్నారు.

టూటౌన్ ఎస్ఐపై ఏసీపీకి ఫిర్యాదు

ఖమ్మంక్రైం జనవరి 24: నగరంలోని టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లోని ఓ ఎస్ఐ పై ఖమ్మం టౌన్ ఏసీపీకి నగరానికి చెందిన సామాజిక కార్యకర్త కోయిన వెంకన్న ఫిర్యాదు చేశారు. నివాసముంటున్న అపార్ట్‌మెంట్‌లోకి ఎస్ఐ తో పాటు మరో నలుగురు మంగళవారం తెల్లవారు జామున రెండు గంటల సమయంలో అక్రమంగా ప్రవేశించారని, వాచ్‌మెన్ కుటుంబంపై దౌర్జన్యం కూడా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నల్లాల నుంచి మురుగు నీరు



మామిళ్లగూడెంలో మిషన్‌భగీరథ నల్లాల నుంచి వచ్చిన మురుగు నీరు

ఖమ్మంకార్పొరేషన్, జనవరి24: నగరంలోని మామిళ్లగూడెం ప్రాంతంలో మిషన్ భగీరథ ద్వారా ఏర్పాటు చేసిన నల్లాల నుంచి మురుగునీరు రావటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన కూడా వస్తున్నాయి. మిషన్ భగీరథ పైప్‌లైన్లు లీకై, డ్రెయినేజీ నీళ్లు కలుస్తున్నాయా? అన్న అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. కాగా వారంరోజులుగా నల్లాల నుంచి మురుగునీరు వస్తున్నట్లు స్థానికులు తెలిపారు. మొత్తం పైప్‌లైన్‌ను తనిఖీ చేయాలని ప్రజారోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. ఎక్కడ పైప్‌లైన్ లీక్ అయింతో తెలుసుకొని, అక్కడి నుంచి కొత్తపైప్‌లైన్ వేయాల్సి ఉంటుంది. సత్వరమే అధికారులు చర్యలు తీసుకొని, రక్షితనీరు వచ్చేవిధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

జీవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువచైతన్యం

ఖమ్మంరూరల్, జనవరి 24: విద్యార్థినులకు అత్యవసర సమయంలో అందించాల్సిన వైద్య సేవలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను జీవీ ఫౌండేషన్ బాధ్యులు ఖమ్మంలోని శ్రీ రక్ష హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ గోంగూర వెంకటేశ్వరరావు వివరించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని మద్దులపల్లిలోని సాంఘిక సంక్షేమ మహిళా డీగ్రీ కళాశాలలో యువత చైతన్య కార్యక్రమం బుధవారం నిర్వహించారు.

రహదారి విస్తరించాలని మంత్రి పొంగులేటిని కోరిన నాయకులు

ఖమ్మంరూరల్, జనవరి 24: మండల పరిధిలోని పల్లెగూడెం నుంచి మంగళగూడెం రహదారి విస్తరణ పనులు త్వరగా చేపట్టాలని రెవిన్యూ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మండల కాంగ్రెస్ నాయకులు, గోళ్లపాడు మాజీ సర్పంచ్ మద్ది వీరారెడ్డి హైదరాబాద్‌లో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. త్వరలో తీర్థాలలో జరగబోయే శివరాత్రి, జాతర ఉన్నందున పల్లెగూడెం నుంచి మంగళగూడెం వరకు తాత్కాలికంగా రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టీ విక్రమార్కను కలిశారు. మంత్రిని కలిసన వారిలో దొడ్డా నాగేశ్వరావు, సంగాచారి, బాలకోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.